ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 17 ఆగస్టు 2025



కలెక్టరేట్‌లో గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

గౌతు లచ్చన్న జీవితం ఆదర్శనీయం : కలెక్టర్

ఏలూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శనీయమని కలెక్టరేట్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో గౌతు లచ్చన్న జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు.ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి

పోరాటాలతోనే హక్కుల సాధన

- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీరాణి

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలమని, లేనిపక్షంలో పాలకులు కార్మికులను పట్టించుకునే పరిస్థితి లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి అన్నారు. స్థానిక రోటరీ క్లబ్ భవనంలో శనివారం 9వ ఏలూరు జిల్లా మహాసభలు జరిగాయి. యూనియన్ పతాకాన్ని జిల్లా అధ్యక్షురాలు పి.సుజాత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ 'కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ ఉద్యోగులను చిన్నచూపు చూస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదు. మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మారుస్తామని చెప్పినా జీవోను అమలు చేయడం లేదు. 2011 నుంచి ఇప్పటి వరకు వేతనాలు పెంచలేదు. ఈనెల 21న దేశవ్యాప్తంగా ఎఫ్ఆర్ఎస్‌పై బ్లాక్ డే నిర్వహిస్తున్నాం. ప్రజలంతా పాల్గొనాలి' అంటూ కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, మొడియం నాగమణి, యర్నం సాయి కిరణ్, పి.సూర్యారావు, విమల, రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.



కొల్లేరుకు.. వరద

ఆటపాక పక్షుల కేంద్రం వద్ద కోమటిలంక రహదారి కొట్టుకుపోయి ఉధృతంగా ప్రవహిస్తున్న కొల్లేరు

మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి వద్ద ముంపునకు గురైన పెనుమాకలంక ఆర్అండ్‌బీ రోడ్డు

- ముంపులో పెద్దఎడ్లగాడి-పెనుమాకలంక రోడ్డు
- ఉధృతంగా సర్కారు కాలువ
- కొట్టుకుపోయిన కోమటిలంక రోడ్డు

కైకలూరు/మండవల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కొల్లేరులో వరద ఉధృతి పెరిగింది. గతంలో ఎన్నడూ లేని రీతిలో కొల్లేరుకు ఎగువ 64 డ్రెయిన్ల నుంచి పెద్దఎత్తున వరద నీరు రావడంతో కొల్లేరు ఉగ్ర రూపం దాల్చింది. దీంతో మండవల్లి మండలంలోని కొల్లేటి లంక గ్రామాలకు ప్రధాన రహదారి అయిన పెద్దఎడ్లగాడి వద్ద పెనుమాకలంక ఆర్అండ్‌బీ రహదారి శనివారం ఉదయానికే మూడుచోట్ల వరద నీటిలో చిక్కుకోవడంతో రాకపోకలు నిలిచాయి. వరదనీటి ఉధృతితో మణిగూలూరులంక, పెనుమాకలంక, నందిగామలంక, శ్రీరామ్‌నగర్, ఇంగిలిపాకలంక, నుచ్చుమిల్లి, తక్కిళ్లపాడు, పుల్లపర్రు గ్రామాలకు ముంపు పొంచి ఉంది. కైకలూరు మండలంలో కొల్లేటికోటలోని సర్కారు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆటపాక పక్షుల కేంద్రం వద్ద పోల్‌రాజ్ డ్రెయిన్ పొంగడంతో ఏలూరు రూరల్ మండలం కోమటిలంకకు రాకపోకలు నిలిచిపోయాయి. డ్రెయిన్‌పై ఆ గ్రామస్థులు నిర్మించుకున్న తాత్కాలిక రహదారి కొట్టుకుపోవడంతో నాటుపడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఎగువ నుంచి మరో రెండు, మూడు రోజుల పాటు భారీగా వరద నీరు సరస్సులోకి వచ్చిచేరుతుందని భావిస్తున్నారు.



కోమటిలంకకు నాటుపడవపై రాకపోకలు

ఉప్పుటేరులో ఆక్రమణలు తొలగింపు



ఆలపాడులో షెడ్డు కూల్చివేత

కైకలూరు, ఆగస్టు 16: కొల్లేరుకు వరద ఉధృతి పెరగడంతో ఉప్పుటేరులోని ఆక్ర మణలను అధికారులు ఎట్టకేలకు తొలగిస్తున్నారు. గతనెల 28న 'ఆక్రమణలు-అడ్డంకులు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కొల్లేరు దుస్థితిపై కథనం వచ్చింది. దీనికి స్పందించిన కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులతో సమీక్షించి ఆక్రమణల తొలగింపు పనులను యుద్ధ ప్రాతి పాదికన చేపట్టాలని ఆర్డీవో అచ్యుత్ అంబరీష్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో శనివారం కైకలూరు మండలం ఆలపాడు శివారు ఉప్పుటేరులో ఆక్రమణల తొలగింపు పనులను చేపట్టారు. ఆర్డీవో ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దులు కేటాయించారు. ఉప్పుటేరు నుంచి చేపల చెరువుల్లోని నీరు తరలించేందుకు ఏర్పాటు చేసిన మోటారు షెడ్లను, ఉప్పుటేరులో పేరుకుపోయిన గుర్రపుడెక్క తొలగింపు పనులను పంటుపై ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి చేపట్టారు. ఆర్డీవో సాయంత్రం వరకు పనులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ 'కొల్లేరుకు వరద ముంపు లేకుండా ఉప్పుటేరు ఆక్రమణలను తొలగిస్తున్నాం. మరిన్ని యంత్రాలను ఏర్పాటుచేసి యుద్ధప్రాతిపాదికన తొలగింపు చర్యలు చేపడతాం. ఇప్పటికే కొల్లేరులోకి వరదనీరు వస్తున్నందున ప్రణాళికబద్ధంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, సర్వేయర్ రమేష్, వీఆర్వో వై.శ్రీనివాస్, పశ్చిమ గోదావరి జిల్లా డ్రెయినేజీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఉప్పుటేరులో కిక్కిసకర్ర తొలగింపు

అర్ధరాత్రి దంచి కొట్టిన వర్షం

- ఏజెన్సీలో పొంగిన కొండవాగులు

ఏలూరుసిటీ/పోలవరం ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి కుంభవృష్టి వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పోలవరం మండలంలో ఏటిగట్టుకి ఇరువైపులా ఉన్న గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, పోలవరం పంచాయతీల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేక నీరు ఇళ్లల్లోకి చేరడంతో గ్రామస్థులు ఇబ్బందులకు గురయ్యారు. పోలవరం బెస్తావీధి, కమ్మరగూడెం, మెయిన్ బజార్‌లో రోడ్లపై నీరు నిలిచింది. కొవ్వాడ కాలువ, కడమ్మ కాలువ, తానాలకుంట కాలువ, జిల్లెళ్లగూడెం కాలువలు పొంగి ప్రవహించాయి. కొవ్వాడ కాలువ జలాలు పట్టిసీమ అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా, కడెమ్మ కాలువ జలాలు కడెమ్మ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి కలుస్తున్నాయి. గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా కుక్కునూరు మండలంలో 68.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 6.5 మి.మీ నమోదైంది. పోలవరంలో 45, వేలేరుపాడు 32.2, బుట్టాయిగూడెం 14, కొయ్యలగూడెం 8.4, జంగారెడ్డిగూడెం 6.8, కామవరపుకోట 2.6, జీలుగుమిల్లి 2 మి.మీ వర్షపాతం నమోదైంది. శనివారం కూడా పలు ప్రాంతాల్లో వర్షం కురి సింది. కాగా ఈనెల 18 నుంచి మరో అల్పపీడనం ఏర్పడ నున్నట్టు ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.



కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి విడుదలవుతున్న కొండవాగుల జలాలు

జోరుగా.. హుషారుగా..



ఏలూరు కొత్త బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళా ప్రయాణికులు

- ఉచిత ప్రయాణం తొలిరోజు 2,781 మంది రాకపోకలు
- రెండోరోజు వేలాది మంది ప్రయాణం

ఏలూరు,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం అమలు చేయడం, దానికి తోడు వరుస సెలవులు రావడంతో మహిళలు ఎక్కువ మంది బస్సుల్లో ప్రయాణం చేయడానికి ఆసక్తి చూపారు. శనివారం ఎక్కువ మంది వాడపల్లి వేంకటేశ్వర స్వామి, ద్వారకా తిరుమల వెంకన్న దర్శనాలకు మొగ్గుచూపారు. మరికొంతమంది సుదూర ప్రాంతాల్లోని తమ కుటుంబీకులను ఒక్కసారి పలకరిద్దామని వెళ్లినవారు లేకపోలేదు. ఉచిత బస్సు ప్రయాణాలను ప్రారంభించిన తొలిరోజు అంటే శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి 177 బస్సుల్లో 2,781 మంది మహిళలు రాకపోకలు సాగించారు. ఇందులో మహిళలు 2,722 మంది ఉండగా, బాలికలు, చిన్నారులు 59 మంది ఉన్నట్లు డీపీటీవో షేక్ షబ్నం చెప్పారు. వారు ప్రయాణించిన రూట్లలో టిక్కెట్ల రూపేణా రూ.98,764లకు జీరో రుసుం టిక్కెట్లను జారీ చేశారు. రెండోరోజు శనివారం వేలాది మంది మహిళలు ఉచితంగా రాకపోకలు సాగించారు. డిపోల వారీగా ఎంతమందికి జీరో టిక్కెట్ జారీ చేశారో వివరాలను అధికారులను ఒక నిర్ణీత ఫార్మెట్‌లో తీసుకుంటున్నారు. ఏలూరు డిపో కంట్రోల్ రూమ్ వద్దనే డీపీటీవో షేక్ షబ్నం, ఏలూరు డీఎం వాణి బస్సుల రాకపోకలు, ప్రయాణాలపై దగ్గరుండి ఆరా తీశారు. ఇదిలా ఉండగా తొలిరెండు రోజులు ఆధార్, ఇతర గుర్తింపు పత్రాలను చూపకపోయినా కండక్టర్లు అనుమతిచ్చారు. ఇక మీద ఖచ్చితంగా గుర్తింపు పత్రాలను తీసుకొని రావాలని మర్యాద పూర్వకంగానే

(మిగతా 8వ పేజీలో)

అత్తాగారింటికి వెళుతున్నా.. రమాదేవి



మా కుటుంబం ఖమ్మంలో ఉంటుంది. మా అత్తగారు లింగపాలెం ఉంటారు. ఎలాగో సెలవులే కదా ఒకసారి చూసి వచ్చేందుకు వెళ్తున్నా. ఉచిత బస్సులతో మహిళలు చుట్టాలను చూడాలనే కోరిక సులువుగా తీరుతోంది.

అమ్మాయిని చూద్దామని : షేక్ నసీమా



మాది రాజమండ్రి.. మా అమ్మాయి ఏలూరులో ఉంటుంది. చంద్రబాబు ఉచిత బస్సు పెట్టారు. సెలవులే కదా అందరూ ఇంటిలో ఉంటారని, ఒకసారి చూసి పోదామని మధ్యాహ్నం ఏలూరులోని మా అమ్మాయి ఇంటికి వచ్చి చూశాను.. మళ్లీ రాజమండ్రికి వెళ్లిపోతున్నా.

చెల్లెలిని చూద్దామని వచ్చా : ప్రియ



మాది గుంటూరు. ఏలూరులో చెల్లి ఉంది. ఒకసారి పలకరించి వెళ్దామని వచ్చా. బస్సుల్లో మర్యాదక పూర్వకంగానే సిబ్బంది వ్యవహ రించారు. ఏదైనా గుర్తింపు కార్డు చూపమన్నారు.

వీరికి ఉచితం లేదట!

- ఉచిత బస్సుకు అంతర్‌రాష్ట్ర సమస్య
- విలీన మండలాల మహిళలకు వర్తించని పథకం

వేలేరుపాడు : రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15న ఎంతో అట్టహాసంగా ప్రారంభించిన స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణానికి విలీన మండలాల్లో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఉచిత బస్సు ప్రయాణం విషయంలో అధికారులు ముంపు మండలాల్లోని పరిస్థితులపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయనట్టుగా తెలుస్తోంది. అంతర్ రాష్ట్ర సమస్యతో విలీన మండలాల మహిళలు ఉచిత బస్సు ప్రయాణానికి దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

- వేలేరుపాడు,కుక్కునూరు మండలాల నుంచి బయట ప్రాంతాలకు వెళ్లే మహిళల వద్ద నుంచి శనివారం ఆర్టీసీ సిబ్బంది టిక్కెట్లు వసూలు చేశారు. మహిళ లకు ఉచిత బస్సు సౌకర్యం ఉంది కదా అని ప్రశ్నించిన వారికి తమకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదని ఆంధ్రా నుంచి తెలంగాణలోకి ఆపై తిరిగి ఆంధ్రాలో భక్తులు ప్రయాణించాల్సి ఉన్నందున దీనిపై స్పష్టత రాలేదని పేర్కొంటూ మహిళల దగ్గర నుంచి టిక్కెట్ సొమ్ములు వసూలు చేశారు.
- జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో నుంచి వేలేరు పాడు, కుక్కునూరు మండలాలకు బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. జంగారెడ్డిగూడెం నుంచి బయల్దేరిన అనంతరం జీలుగుమిల్లి దాటిన తర్వాత తెలంగాణలోకి ప్రవేశించాల్సి ఉంది. సుమారు 30 కిలోమీటర్లు తెలంగాణలో ప్రయాణించిన తర్వాత మండలంలోని మేడేపల్లి వద్ద తిరిగి ఆంధ్రాలోకి బస్సులు ప్రవేశిస్తాయి. వేలేరుపాడు నుంచి భద్రాచలానికి జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో బస్సు నడుపుతున్నారు. కుక్కునూరు మండలం వేలేరు వరకు ఆంధ్రాలోనే ప్రయాణిస్తుంది. అక్కడ నుంచి తెలంగాణ ప్రారంభమవుతుంది. వేలేరు వరకు ఉచిత బస్సు ప్రయా ణానికి అవకాశం ఉన్నప్పటికి భద్రాచలం వెళ్లే ప్రయాణికులు వేలేరుపాడు నుంచి భద్రాచలానికి టిక్కెట్టు కొనాల్సి వస్తోంది.
- కుక్కునూరు నుంచి భద్రాచలం వెళ్లాలన్న ఇటు జంగారెడ్డిగూడెం వెళ్లాలన్న ఇదే సమస్య ఎదురవుతోంది. ముంపు మండలాల మహిళలు ఆంధ్రాలో ఎక్కడికి వెళ్లాలన్న జంగారెడ్డిగూడెం వరకు టిక్కెట్టుపై ప్రయాణించి ఆ తర్వాతనే ఉచిత బస్సు ప్రయాణాన్ని వాడుకునే వీలుంది. వాస్తవానికి తెలంగాణ నుంచి సరిహద్దు జీలుగుమిల్లి వద్ద ఆంధ్రాలోకి ప్రవేశించినప్పటికీ అంతరాష్ట్ర సమస్య వల్ల టిక్కెట్‌ను జంగారెడ్డిగూడెం వరకు తీసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిపై ముంపు మండలాల మహిళల నుంచి నిరసన వ్యక్తమవుతోంది. పోలవరం ప్రాజెక్టు కోసం అన్ని త్యాగం చేసిన తాము ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అర్హులంకామా..? అంటూ ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖాళీలపై ఆరా



- మెగా డీఎస్సీ నియామకాల్లో మరో ముందడుగు
- జిల్లాల వారీగా వివరాలు కోరిన ఉన్నతాధికారులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఎదుర్కొంటున్న ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలో చేపట్టనున్న మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకాలను పూర్తిచేసేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ యాజమాన్యాల్లో మొత్తం 1,035 ఉపాధ్యాయ ఉద్యోగాలను మెగా డీఎస్సీలో భర్తీ చేయనున్న విషయం విదితమే. ఇప్పటికే డీఎస్సీలో అభ్యర్థులు సాధించిన మార్కులను విడుదల చేసిన విద్యాశాఖ తదుపరి మెరిట్ జాబితా, రిజర్వేషన్ కం రోస్టర్ మార్గదర్శకాల మేరకు సెలక్షన్ జాబితా, అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, పోస్టింగ్‌లకు కౌన్సెలింగ్ ద్వారా నియామకాల ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే నియామకాల ప్రక్రియలో భాగంగా జిల్లాల వారీగా వివరాలను పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. డీఎస్సీ-2025లో ఉమ్మడి పశ్చిమలో నోటిఫై చేసిన మొత్తం పోస్టుల సంఖ్యను మేనేజ్‌మెంట్, కేటగిరీ, మీడియం, సబ్జెక్టు వారీగా పంపాలని సూచించారు. ఈ నెల 31వ తేదీ నాటికి ఏర్పడే ఖాళీలసంఖ్యను ఇదే ఫార్మెట్‌లో అందజేయాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్‌లు కేటాయించేందుకు పాఠశాలల వారీగా వెకెన్సీల వివరాలు, అసలు టీచరే లేకుండా కేటగిరీ-3/4ల్లోవున్న స్కూల్స్ వివరాలు, ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నూతన స్థానాలకు బదిలీ అయినా రిలీవర్ లేక పాతస్కూలులోనే కొనసాగుతుంటే ఆ స్కూలు వివరాలు, 50 శాతం మందికి పైబడి టీచర్లు కూడాలేని పాఠశాలలు, కేటగిరీ-3/4ల్లోని స్కూళ్లలో ఇంకా ఎన్ని వెకెన్సీలు భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.. తదితర వివరాలన్నింటినీ సేకరించడానికి ఉమ్మడి జిల్లా స్థాయిలో ఈనెల 18న బృందాలను నియమించి నిర్ణీత ఫార్మేట్‌లో క్షేత్రస్థాయి నుంచి డేటాను తీసుకోవాలని ఆదేశించారు.

ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా కుక్కునూరు, వేలేరుపాడు తదితర మండలాల్లో బదిలీలు జరిగినా ఆ ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ కోసం ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో పెద్దసంఖ్యలోనే టీచర్ల కొరత కొనసాగుతోంది. ఫలితంగా ఈ మండలాల్లో బోధన కుంటుపడుతోంది. ఈ పరిస్థితిపై కొంతకాలంగా విద్యార్థి, ప్రజా సంఘాలు ఆందోళన నిర్వహిస్తున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌తో ఈ మండలాల్లోని టీచరు పోస్టులన్నీ భర్తీ కావడంతో పాటు, బదిలీ ఖరారైనప్పటికీ రిలీవర్ లేక ఇప్పటికీ పాత స్థానాల్లోనే కొనసాగుతున్న ఉపాధ్యాయులకు ఊరట లభించడం ఖాయమని చెప్పవచ్చు.

రేపు డీఆర్‌సీ సమావేశం

ఏలూరు,ఆగస్టు 16(ఆంధ్ర జ్యోతి): జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశం (డీఆర్‌సీ) ఈనెల 18న మధ్యాహ్నం 3.30 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా ఇన్ చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరుగు తుందని కలెక్టర్ వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. నాదెండ్లతో పాటు మంత్రులు పార్థసారథి, ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పంచాయతీరాజ్, ఆర్అండ్ బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇతర అంశాలపై సమీక్ష ఉంటుందన్నారు.

ప్రాణాలతో చెలగాటం

- పరిమితికి మించి విద్యార్థులను కుక్కేస్తున్నారు..
- నిబంధనలు పాటించని స్కూల్ బస్సులు, ఆటోలు

పాత పెన్షన్ విధానం అమలు కోసం..

25న విజయవాడలో మహాధర్నా

■ లోపలి పేజీలో..

దర్జాగా నరికేస్తున్నారు..!

- అమరవరం అటవీరేంజ్ పరిధిలో జామాయిల్‌పై అక్రమార్కుల కన్ను
- బర్లమడుగు అటవీప్రాంతంలో వందకు పైగా జామాయిల్ చెట్లు నరికివేత
- తరలించే క్రమంలో బురదలో ఇరుక్కుపోయిన ట్రాక్టర్



అక్రమంగా జామాయిల్ కర్రలను తరలిస్తుండగా బురదలో ఇరుక్కుపోయిన ట్రాక్టర్ ట్రక్కు

కుక్కునూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అమరవరం అటవీరేంజ్ పరిధిలో అక్రమార్కులు జామాయిల్ చెట్లను నరికివేస్తున్నారు. బర్రలమడుగు అటవీప్రాంతంలో అటవీశాఖ ద్వారా వేసిన జామాయిల్ ప్లాంటేషన్ నుంచి వంద నుంచి 150 జామాయిల్ చెట్లు నరికివేశారు. ఈ కర్రలను ట్రాక్టర్‌పై అక్రమంగా తరలిస్తు సొమ్ము చేసుకునే క్రమంలో బురదలో ట్రక్కు దిగబడింది. గత రెండురోజులుగా యథేచ్ఛగా జామాయిల్ నరికివేస్తున్నా అటవీ సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఇక్కడ జామాయిల్ ప్లాంటేషన్ నుంచి కర్రను అక్రమంగా నరికి వేసి తరలించిన ఘటనలున్నాయి. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. కొంతమంది అటవీ ఉద్యోగుల పాత్ర ఇందులో ఉందని ఆరోపణలు వస్తున్నప్పటికి వారిపై చర్యలు తీసుకోకపోవడంతో అడవిని కొల్లగొడుతున్నారు. జామాయిల్ ధర టన్ను రూ.7వేలు పైగా ఉండడంతో అక్రమార్కుల చూపు జామాయిల్ ప్లాంటేషన్‌పై పడింది. ఇప్పటికైనా అధికారులు దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై డిప్యూటీ రేంజ్ అధికారి అశోక్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా మాకు ఇప్పుడే సమాచారం తెలిసిందని, క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి గార్డును పంపినట్టు తెలిపారు.



కృష్ణుడి వేషధారణలో లక్షిత్, తంగెళ్లమూడి



తణుకు మాంటిస్సోరి స్కూలులో..



పెనుగొండ ఆక్స్‌ఫర్డ్ చిన్నారులు



గణపవరంలో కె.అభిజిత్



గోపిక వేషధారణలో నిత్విక, సత్రంపాడు



పెనుమంట్రలో చిన్నారులు



పెనుగొండ భాష్యం పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్నారి



ఆకివీడులో చిన్నారుల వేషధారణలు



చిలుకూరులో ఉట్టి కొడుతున్న డిప్యూటి స్పీకర్ రఘురామ



తణుకులో రాధాకృష్ణుల వేషధారణ ధృవ, ఉద్దవ్



భీమవరంలో చిన్నారుల వేషధారణలు



పాలకొల్లులో బైక్‌పై కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



మొగల్తూరు అగ్రహారంలో

గోపాల.. గోపాల

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. పాఠశాలల్లోనూ, ఆలయాల వద్ద చిన్నారుల వేసిన శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. పలు చోట్ల సాయంత్రం సమయంలో ఆలయాల నిర్వాహకులు ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు నాగిరెడ్డిగూడెం గురుకుల విద్యార్థిని ఎంపిక



పోటీలో గెలిపొందిన విద్యార్థినులకు మెడల్స్, ప్రశంసా పత్రంతో ఉపాధ్యాయులు

చింతలపూడి, ఆగస్టు 16 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు నాగిరెడ్డిగూడెం గురుకుల బాలికల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎస్. జాస్మిత ఎంపి కైందని ప్రిన్సిపాల్ ఎస్.హేమలత తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థిను లను సత్కరించారు. ఏలూరులో జరిగిన ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించిం దని, 22న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆమె తెలిపారు. మరో విద్యార్థిని అమలారాణి ట్రెడిషినల్ జూనియర్ స్థాయిలో యోగాలో మూడో స్థానంలో నిలిచి మెడల్ సాధించిందన్నారు. ఈ సంద ర్భంగా తర్ఫీదు ఇచ్చిన పీఈటీ బాల భారతిని, విద్యార్థినులను అభినందించారు.

'తెలుగు తేజం అవార్డు'కు డాక్టర్ పార్థసారథి ఎంపిక



ఏలూరు రూరల్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కన్నాపురానికి చెందిన ప్రముఖ కవి, విద్యావేత్త, సాహితీవేత్త, రచయిత డాక్టర్ టి.పార్థసారథి శ్రీశ్రీ కళావేదిక అందించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'తెలుగు తేజం' అవార్డు అందుకోనున్నారు. ఈమేరకు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తి మండ ప్రతాప్ నుంచి ఆహ్వానం అందుకున్నారు. ఈ అవార్డును పల్నాడు జిల్లా, నరసరావుపేటలో ఈనెల 31న నిర్వహించే తెలుగుభాష సంబరాల కార్యక్రమంలో ప్రముఖులు చేతుల మీదుగా స్వీకరించనున్నట్లు డాక్టర్ పార్థసారథి తెలిపారు. తెలుగు భాష, సాహిత్య, సంప్రదాయ, సంస్కృతుల పరిరక్షణ, ప్రాచుర్యం విస్తరణలో అపారమైన కృషి చేస్తున్నానని సృజనాత్మక ప్రతిభకు ఈ అవార్డు ఒక గుర్తింపుగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా పార్థసారథిని పలువురు కళ, సాహిత్య అభిమానులు అభినందించారు.

మెగాస్టార్‌కు చిత్రపటం బహూకరణ



చిరంజీవికి చిత్రపటాన్ని అందిస్తున్న లిఖిత

నరసాపురం రూరల్,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : నరసాపురం మండలం కొప్పర్రు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు పోలిశెట్టి శ్రీనివాస్ కుమార్తె లిఖిత మెగాస్టార్ చిరంజీవిని కలిసి చిత్రపటాన్ని బహూకరించింది. నటుడిగా, బ్లడ్ బ్యాంకు ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిరంజీవిపై అభిమానంతో హైదరాబాద్‌లోని ఓ స్కూల్ తొమ్మిదో తరగతి చదువుతున్న ఆ విద్యార్థిని మెగాస్టార్ చిత్రపటాన్ని గీసింది. దానికి కొన్ని హంగులు చేయించి తండ్రి శ్రీనివాస్ ఆ చిత్రాన్ని ఫ్రేమ్ కట్టించాడు. కుమార్తెను తీసుకుని హైదరాబాద్‌లో చిరంజీవిని కలిశారు. ఆ ఫొటోను చూసిన చిరంజీవి సంతోషాన్ని వ్యక్తి చేసి లిఖితను అభినందించారన్నారు.

మూడు స్వర్ణాల విజేత పవన్‌కు సత్కారం



పవన్‌ను సత్కరిస్తున్న అంబేద్కర్ సేవాసమితి సభ్యులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 16 (ఆంధ్ర జ్యోతి) : పారా అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపర్చి మూడు స్వర్ణ పతకాలు సాధించిన కస్సే పవన్‌కుమార్‌ను గ్రామస్థులు శనివారం సత్కరించారు. ఈనెల 9న విశాఖలోని పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో పవన్‌కుమార్ ప్రతిభసాధించిన విషయం తెలిసిందే. పంగిడిగూడెంకు చెందిన అతడిని అంబేడ్కర్ సేవా సమితి సభ్యులు మానుకొండ శ్రీను, గోగులమూడి సోమయ్య, కొదం కిషోర్, కాలి అశోక్, డి.సురేష్, చిన్న భాస్కరరావు పవన్‌తో కేక్ కట్ చేయించి సత్కరించారు.

గోవిందా.. గోవింద..

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం





వేంకటేశ్వరస్వామి కల్యాణంలో భక్తులు.. (ఇన్‌సెట్‌లో) కల్యాణమూర్తులకు హారతులిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గోవింద నామ స్మరణతో చినవెంకన్న క్షేత్రంలో ఆధ్యాత్మికత సంతరించుకుంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు శనివారంతో పాటు శ్రావణమాసం కావడం వల్ల క్షేత్రానికి విశేషసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో నిండిపోయాయి. స్వామివారి ఉచిత దర్శనానికి దాదాపు రెండు గంటల పైబడి సమయం పట్టింది. సుమారు 20వేల మంది పైబడి భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చినట్టు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు ఉచిత తీర్థ, ప్రసాదాలను ఆలయ ఆవరణలో స్వీకరించి, ఆ తర్వాత అన్నప్రసాదాన్ని వకుళమాత అన్నప్రసాద భవనంలో తీసుకున్నారు.

192 జంటలతో నిత్యార్జిత కల్యాణం

చిన్నతిరుమలేశుని నిత్యార్జిత కల్యాణం రికార్డుస్థాయిలో దాదాపు 192 జంటలతో వైభవంగా జరిగింది. తొలుత ఆలయ ఆవరణలో తొళక్కవాహనంపై స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులను ఉంచి అలంకరించి నిత్యకల్యాణ మండప వేదిక వద్దకు తెచ్చారు. తొలుత అక్కడ వున్న రెండు బంగారు సింహాసనాలపై స్వామి, అమ్మవార్ల మూర్తులను ఉంచి అలంకరించారు. అనంతరం అర్చకులు కల్యాణతంతును ప్రారంభించారు. వైఖానస ఆగమప్రకారం సుముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపచేశారు. అనంతరం మాంగల్యధారణ, తలంబ్రాలు వేడుక అర్చకుల వేదమంత్రోచ్చరణలు, భక్తుల గోవింద నామస్మరణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా జరిగింది. ఈ కల్యాణ తంతును తిలకించిన భక్తజనులు పరవశించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు మూడు టన్నుల కూరగాయల వితరణ

చినవెంకన్న నిత్యాన్నదాన ట్రస్టునకు ఓ దాత మూడు టన్నుల కూరగాయలను అందించారు. నూజివీడుకు చెందిన నక్కా సత్యనారాయణ పలు రకాల కూరగాయలను తీసుకుని శనివారం క్షేత్రానికి వచ్చారు. స్వామి దర్శనానంతరం వాటిని తీసుకుని అన్నదాన సదనం వద్దకు వెళ్లి సిబ్బందికి అందించి వీటిని అన్నదానంకు వచ్చిన భక్తుల కోసం వినియో గించాలని సూచించారు.



శ్రీవారి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు




కూరగాయలు అందజేసిన దాత

శాకాహారులకు ఊరట

దిగివచ్చిన కూరగాయల ధరలు

- స్థిరంగా టమాటా, ఉల్లి
- ఎగబాకుతున్న అల్లం



(ఏలూరు-ఆంధ్రజ్యోతి): శాకాహారులకు కూరగాయల ధరలు ఉపశమనం కలిగిస్తున్నాయి. కొన్ని రకాల కూరగాయలు కిలో రూ.20-25 మధ్యకు దిగడంతో వినియోగదారులు లొట్టలేసుకుని తింటున్నారు. గతవారం నుంచి కూరగాయల ధరలు అమాంతంగా దిగి వచ్చాయి. పలు పంటలు చేతికి రావడంతో కూరలు ధరలు తగ్గుముఖం పట్టాయి. సామాన్యులకు కూరగాయలు అందుబాటులో ఉన్నాయి. రెండు వారాలుగా టమాటా ధర మాత్రం కిలో 46 రూపాయల వద్ద స్థిరంగా ఉంటోంది. ఉల్లి ధరలు పెరుగుదల సంతరించుకోలేదు. కిలో రూ.25 నుంచి రూ.30కు నాణ్యమైన పాయలు లభ్యమవుతున్నాయి. రైతుబజార్‌లో మాత్రం బెండ, వంకాయ, కాకరకాయలు కిలో 20 రూపాయలు పలుకుతుండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.30 నుంచి రూ.35 వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. గత వారంలో ఇవి రైతు మార్కెట్‌ల్లో రూ.40పైనే అమ్మగా, బహిరంగ మార్కెట్‌లో రూ.60కుపైనే అమ్మారు.

క్యారెట్, బీట్‌రూట్ కిలో రూ.40 మేర పలుకుతున్నాయి. దొండకాయలు రూ.24, బంగాళదుంపలు రూ.32, దోసకాయలు రూ.26, బీరకాయలు రూ.30 వరకు అమ్మకాలు జరుపుతున్నారు. చిక్కుడు కాయ, చామదుంప, కీరదోస రూ.40, ఇక అధిక విటమిన్లు ఉండే బీన్స్, క్యాప్సికమ్ ధరలు రూ.80కు ఎగబాకాయి. ఇవి గత వారం రూ.60లోపే ఉండేవి. తీగ జాతికి చెందిన ఆనప, పొట్లకాయ ధరలు కొంత ఎక్కువగానే ఉన్నాయి. ఇవి పంట చివర దశలో ఉండడం వల్ల ఈ రేట్లు పలుకుతున్నట్లు చెబుతున్నారు. సరుకు తక్కువగా రావడం వల్ల డిమాండ్ ఉండడంతో ధర పెరిగింది. ఆనబకాయి రూ.15నుంచి రూ.20, పొట్లకాయ రూ.20-25 ధరలే రైతుబజార్లలో పలుకుతున్నాయి. ఇక బహిరంగ మార్కెట్‌లో పెచ్చు ధరకే విక్రయిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు రూ.40-50 మధ్య ఉండే అల్లం కిలో ఇప్పుడు రూ.90 పలుకుతోంది. ఆకుకూరలు ధరలు కూడా అందుబాటులోనే ఉన్నాయి. 10 -12 రూపాయలు మూడు కట్టలు అందుబాటులో ఉంటున్నాయి. పచ్చిమిర్చి కూడా దిగి వచ్చింది. కిలో 60కు అమ్మకాలు సాగగా, నేడు ఆ ధర రూ.40కు దిగింది.

వరుస వర్షాలతో ధరల మోతే ?

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఇటీవల విస్తారంగా వర్షాలు కురవడంతో కూరగాయల పంటలకు కూడా నష్ట ప్రభావం ఉండనుంది. దీంతో వచ్చేవారంలో కూరగాయల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఆకుకూరలకు ఈ వర్షం ఎఫెక్ట్ పడనుంది. చీడపీడలు అధిక వర్షాలకు సోకే అవకాశం లేదు. అల్లం, మిర్చి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. మొత్తం మీద గడిచిన వరలక్ష్మీవ్రతం నుంచి కూరగాయలు శాకాహారులకు కొంత ఊరటనిచ్చాయనే చెప్పాలి.



గణనాథులు వస్తున్నారు..

- విగ్రహాల తయారీలో నిమగ్నమైన కళాకారులు
- వినాయక చవితి ఏర్పాట్లలో నిర్వాహకులు

తాడేపల్లిగూడెం/ పెనుగొండ, ఆగస్టు 16(ఆంధ్రజోతి): ఉమ్మడి పశ్చిమ జిల్లాలో వినాయకచవితి ఏర్పాట్లు మొదలయ్యాయి. ఇప్పటికే చవితి ఎలా నిర్వహించాలనే దానిపై నిర్వాహకులు సన్నద్ధమవుతున్నారు. ఈ నెల 27న వినాయకచవితి పండుగ పురస్కరించుకుని విగ్రహాల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు. వాటిని ముందస్తుగానే కొనుగోలు చేసి మండపాల వద్దకు తీసుకొచ్చేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు. అధిక మాసం వచ్చిన సంవత్సరంలో మాత్రం ఆగస్టులో వరలక్ష్మీ వ్రతం వస్తే, సెప్టెంబరు మాసంలో వినాయక చతుర్థి నిర్వహిస్తుంటారు. కాని ఈ ఏడాది రెండు పండుగలు ఆగస్టులోనే రావడంతో ఉత్సవాల హడావుడి మార్కెట్లో కనిపిస్తోంది. చవితి పందిళ్ల పెద్ద సంఖ్యలో నిర్వహించడానికి నిర్వాహకులు స్థలాల సేకరణ ప్రారంభించారు. చవితి వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచిన విగ్రహాల తయారీ ఊపందుకుంది. వినాయక చవితి కోసం తాడేపల్లిగూడెం మండలం యాగర్లపల్లిలో ఉన్న శ్రీవిజయదుర్గ విగ్రహాల తయారీ కేంద్రంలో 300కు పైగా వినాయక విగ్రహాలను విక్రయానికి సిద్ధంగా ఉంచారు. పెనుగొండ మండలంలో కూడా విగ్రహాల తయారీ అధికంగా ఉన్నాయి. అదేవిధంగా ఏలూరు రామకృష్ణాపురం కాలువ గట్టు ఒడ్డున విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయి. ఒక్కొక్క విగ్రహం ఎత్తు, ఫినిషింగ్, డిజైన్ ఆధారంగా విక్రయాలు చేస్తున్నారు. రెండు అడుగులు మొదలుకుని 13 అడుగుల ఎత్తుగల వినాయక విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. రెండు అడుగుల విగ్రహం రూ.2000 నుంచి 13 అడుగు విగ్రహం రూ.60వేలకు విక్రయిస్తున్నారు. అనకాపల్లి, హైదరాబాద్, ముంబై, కర్నూల్, లోకల్ మోడల్స్ అందుబాటులో ఉంచారు. రాజస్థాన్ నుంచి వచ్చిన కార్మికులు ఈ విగ్రహాలను తయారు చేస్తున్నారు. అనకాపల్లి మోడల్ వినాయకుడు చిన్నగా ఉండడంతో పాటు బొద్దుగా ఉంటాడు. హైదరాబాద్ మోడల్స్ ఎక్కువగా శివుడి ఆకారంలో ఉండే వినాయకుడు, తాబేలు మీద కూర్చున్న వినాయకుడు, డప్పు, త్రిశూల్‌తో ఉన్నా వినాయకుడు, బొద్దు వినాయకుడు ఇలా పలు రకాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి.

- తాడేపల్లిగూడెం మండలం యాగర్లపల్లిలో విగ్రహాల తయారీ కోసం ఏడాది పొడవునా రాజస్థాన్‌కు చెందిన 15మంది కార్మికులు ఉంటూ తయారు చేస్తున్నారు. వీరిలో మగవారికి రూ.1200, ఆడవారికి రూ.800 కూలి చెల్లిస్తున్నారు. ఈ విగ్రహాలు పూర్తిగా పీవోపీతో తయారు చేసినవే ఇక్కడ అమ్ముతున్నారు. హోలీ వెళ్లిన తరువాత నుంచి వినాయక విగ్రహాల తయారీలో కార్మికులు పనిచేస్తుంటారు. ఆ తరువాత వీరి జీవనం అంతా కృష్ణుడు, బుద్ధుడు, డిబ్బీలు తయారు చేసుకుని ఇక్కడే జీవనం సాగిస్తున్నారు. వీరందరికి ముందుగా నిర్వాహకుడు డబ్బులు పెట్టుబడి పెట్టి విగ్రహాలు తయారు చేయించుకుంటారు.

ఈ ఏడాది విగ్రహాల అమ్మకాలు బాగుంటాయి !



ఈ ఏడాది వినాయకచవతికి వ్యాపారం బాగుంటుందని అనుకుంటున్నా. వర్షాలు తక్కువగా ఉంటే ఉత్సవాలు బాగా చేసుకుంటారు.విగ్రహాలకు ఆర్డర్లు ఇవ్వడం ప్రారంభమైంది. రోజులు దగ్గర వచ్చేకొలదీ ఆయా ఆలయ నిర్వాహకులు ధరలు మాట్లాడుతుకుని తీసుకెళుతుంటారు. పెట్టుబడులు పెరిగాయి. వ్యాపారం బాగా సాగితే పెట్టుబడులు తద్వారా లాభాలు వస్తాయి.

జి.సాయి, నిర్వాహకుడు, యాగర్లపల్లి

విగ్రహాల తయారీలో 15 మంది పనిచేస్తారు..



సంత్సరాల తరబడి ఉపాధికోసం ఇక్కడే ఉండిపోతున్నాం. సీజన్ అయిపోయిన తరువాత జీవనోపాధికోసం కృష్ణుడు, బుద్ధుడు, డిబ్బీలు వంటివి తయారు చేసి జీవనం సాగిస్తుంటాం. కొన్న సందర్భాల్లో అడ్వాన్సులు కూడా తీసుకోవాల్సి వస్తుంది. సీజన్‌లో మాత్రం జీవనం సాఫీగానే సాగుతుంది. రాజస్థాన్ నుంచి వచ్చిన 15 మంది ఈ విగ్రహాల తయారీలో పలు దశల్లో పనిచేస్తూ ఉంటారు.

- ఉమా అమర్, రాజస్థాన్, విగ్రహాల తయారీదారుడు

వరద నీటిలో నత్తా రామేశ్వరస్వామి ఆలయం



నత్తారామేశ్వరస్వామి ఆలయంలోకి చేరిన వరద నీరు

పెనుమంట్ర, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నత్తా రామేశ్వరంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం రామేశ్వర స్వామి ఆలయం వరద నీటితో ముంపునకు గురైంది. రెండు రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గోస్తనీ నది పోటెత్తింది. ఈమేకు ఆలయ ప్రాంగణంలోకి వరద నీరు వచ్చి చేరింది. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు మోకాళ్ల లోతు నీటిలో నుంచి వెళ్లి స్వామిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు వరద నీరు ఆలయ ప్రాంగణానికి వచ్చి చేరడంతో అవస్థలు పడుతున్నారు.

నిర్వాసితుల తరపున పార్లమెంట్‌లో పోరాడతా

» సీపీఎం ఫ్లోర్ లీడర్, కేరళ ఎంపీ జాన్ బ్రిట్టాస్



రెడ్డిగణపవరం నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎంపీ బ్రిట్టాస్

బుట్టాయగూడెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించి సదుపాయాలు కల్పించే వరకు వారి తరపున పార్లమెంట్‌లో పోరాడతానని సీపీఎం ఫ్లోర్ లీడర్, కేరళ ఎంపీ జాన్ బ్రిట్టాస్ స్పష్టం చేశారు. శనివారం ఏజెన్సీలో పర్యటించిన ఆయన రెడ్డిగణపవరం నిర్వాసితుల కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితులను ఆదుకోవడంలోనూ, సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనట్టు తెలిపారు. నిర్వాసితుల కోసం నిర్మించిన కాలనీలు నివాస యోగ్యంగా లేవన్నారు. విద్యుత్, రోడ్లు, డ్రెయిన్లు, మంచినీరు, శ్మశాన వాటికలు ఇతర సమస్యలతో నిర్వాసిత గిరిజనులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల 1.60 లక్షల కుటుంబాలు ముంపునకు గురవుతున్నాయని వాటిలో 80శాతం గిరిజన కుటుంబాలే ఉన్నట్లు తెలిపారు. వీరికి కాలనీలు నిర్మించలేదని, 33 వేల కోట్ల రూపాయల నష్టపరిహారం అందించవలసి ఉందన్నారు. భూముల సేకరణలో అనేక అవకతవకలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని అక్రమాలను పార్లమెంటు వేదికగా ప్రస్తావిస్తానని తెలిపారు. తొలుత బుట్టాయగూడెం నుంచి రెడ్డిగణపవరం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బి.బలరాం, తులసీదాసు, ఎ.రవి, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, అందుగుల ఫ్రాన్సిస్, పోలోజు నాగేశ్వరావు, పి.మంగరాజు, తెల్లం దుర్గారావు, గుడెల్లి వెంకట్రావు, పిల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన కంతేటి వెంకట్రాజు

భీమవరం టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలో వున్న పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు విచ్చేసి స్వామిని దర్శించుకోవాలని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను వేంకటేశ్వరస్వామి మందిర చైర్మన్ కంతేటి వెంకటరాజు కోరారు. శనివారం వెంకటరాజు మాట్లాడుతూ స్వాతంత్ర్య దిన వేడుకల్లో ప్రత్యేక ఆహ్వానితుడిగా విజయవాడ వెళ్లానని, అనంతరం జరిగిన గవర్నర్ తేనేటి విందులో పాల్గొన్నానన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను కలిసి భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలో పద్మావతి వేంకటేశ్వరస్వామివారి ఆలయ విశిష్టత, నిత్య పూజాకార్యక్రమాలు, సేవలను వివరించామనానరు. త్వరలో ఆలయంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసి స్వామిని దర్శించుకోవాలని ఆహ్వానించామన్నారు.

ఆక్వా రంగానికి పూర్వ వైభవం తీసుకొస్తాం

» భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు



ఎమ్మెల్యే అంజిబాబును కలిసిన చైనా రొయ్యల బయ్యర్స్

భీమవరం టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆక్వారంగం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని, ఆక్వా రంగంపై టారిఫ్‌ల ప్రభావం తాత్కాలికమేనని, సంక్షోభంలో కూరుకుపోయిన ఆక్వా రంగానికి పూర్వవైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. శనివారం భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో చైనాకు చెందిన ఆక్వా బయ్యర్స్ జహాకీన్, డాఅన్యాంగ్, ఆక్విబ్‌లు మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఆంధ్రాలోని ఆతిథ్యం, మర్యాదలు వంటకాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని వారన్నారు. ఆక్వా రంగం సంక్షోభంలో ఉన్న తరుణంలో భీమవరం చుట్టుపక్కల రైతుల చెరువులను పరిశీలిస్తున్నామన్నారు. దీనిపై ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ఆక్వా రంగాన్ని ఆదుకుంటామని అన్నారు. సూర్య మిత్ర ఎగ్జామ్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ యిర్రింకి సూర్యారావు, ఆక్వా సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్నదమ్ములకు 'ఐఐటీ'లో సీట్లు



ద్వారకానగర్‌కు చెందిన ఆసిస్, అనిష్

ద్వారకాతిరుమల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో ద్వారకాతిరుమల మండలం ద్వారకానగర్‌కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు ఆసిష్, అనిష్ ఇద్దరూ సీట్లు సాధించారు. పెద్దవాడైన ఆసిష్ ఎంటెక్ గేట్‌లో 732వ ర్యాంక్ సాధించి గౌహతిలోని ఐఐటీలో ఏరోస్పేస్‌లో సీటు సాధించాడు. అలాగే అనిష్ బీటెక్‌లో జేఈఈ అడ్వాన్స్‌లో 867వ ర్యాంకు సాధించి ముంబై ఐఐటీలో మెకానికల్‌లో సీటు సాధించినట్టు తల్లిదండ్రులు నాయుడు వెంకట సత్యనారాయణ, రేణుక తెలిపారు. ఒక ప్రణాళిక ప్రకారం కష్టపడి చదవడం వల్లే ఇటీవల వచ్చిన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని వివరించారు.

20న శ్రీకాకుళంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ రాష్ట్ర సమావేశం

ఏలూరు రూరల్,ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి):ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు కూటమి ప్రభుత్వం న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు కోరారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటు వర్కర్స్‌కు న్యాయం చేస్తుందని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నామన్నారు. ఈనెల 20న శ్రీకాకుళంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్ ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర యూనియన్ నాయకులు, ప్రధాన కార్యదర్శి బొజ్జ రామకృష్ణ హాజరుకానున్నారని రాష్ట్ర సమావేశానికి ఎలక్ట్రికల్ వర్కర్స్ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



విద్యాబుద్ధులు నేర్చుకుని తమ భవిష్యత్తుతో పాటు తదుపరి తరాల భవిష్యత్తుకు కూడా వారు అభివృద్ధి మార్గాలను అన్వేషిస్తూ ఆ దిశగా నిర్మాణాలు చేపట్టాల్సిన విద్యార్థులు. అలాంటి విద్యార్థులు ఎన్నో ఆలోచనలు, ఎన్నో ఊహలు, ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకోవడానికి, విద్యా బుద్ధులు నేర్చుకోవడానికి పాఠశాల, కళాశాలలకు వెళ్తుంటారు. స్కూలు, కాలేజీలు అయిపోగానే ఎంత త్వరగా ఇంటికి వెళ్తామా అని ఆతృత పడు తుంటారు. అయితే వారు బస్సు, ఆటో ఎక్కితే సీట్లు చాలక ఒకరిపై ఒకరు కూర్చునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రైవేటు స్కూళ్లు వేలాది రూపాయలు వసూలు చేస్తూ సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విద్యార్థుల ప్రయాణం నరకప్రాయంగా ఉంటోంది. ఒక్కోసారి అనుకోని ప్రమాదం జరిగితే అప్పుడు అధికారులు హడావిడి తనిఖీలు చేస్తుంటారు.

ప్రాణాలతో చెలగాటం

» పరిమితికి మించి విద్యార్థులను కుక్కేస్తున్నారు..
» నిబంధనలు పాటించని స్కూల్ బస్సులు, ఆటోలు
» చోద్యం చేస్తున్న అధికారులు
» ఏదైనా సంఘటన జరిగితేనే హడావుడిగా తనిఖీలు
» ఘాటీల్లో తిరిగిన సెకండ్ హ్యాండ్ బస్సుల కొనుగోళ్లు?
» స్టీరింగ్ పనిచేయక బ్రేక్‌లు ఫెయిలై ప్రమాదాలు..

ఏలూరు క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్కూలు పిల్లలను తీసుకు వెళ్తామంటూ తల్లిదండ్రుల వద్ద నెలకు ఇంత సొమ్మంటూ వసూలు చేసుకుని విద్యార్థులను ఆటోలో కుక్కేస్తున్నారు. ఒక్కొక్క ఆటోలో 25 మంది పిల్లల వరకూ కూడా ఎక్కించుకుని స్కూలుకు తీసుకువెళ్తున్నారంటే ఆ పిల్లల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. విద్య వ్యాపారంగా మారిపోవడంతో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. అనేక కళాశాల బస్సులు విద్యార్థులను అనుమతికి మించి అదనంగా ఎక్కించుకుని నిలబడి ప్రయాణం చేస్తుండగా మరికొంతమంది ఒకరి ఒడిలో ఒకరు కూర్చుని ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రతి బస్సుకు డ్రైవర్‌తో పాటు క్లీనర్ ఉండాల్సి ఉండగా కొన్ని బస్సులకు ఉండడం లేదు. 60 ఏళ్ళ వయస్సు దాటిన వారిని డ్రైవర్‌గా పెట్టుకోకూడదనే నిబంధన ఉన్నప్పటికీ కొంత మంది వృద్ధులను డ్రైవర్లుగా పెట్టేస్తున్నారు. పలువురు డ్రైవర్లు అతి వేగంగా బస్సులను నడిపివేస్తున్నారు. వీటి మీద అధికారుల పర్యవేక్షణ లోపించడంతో మరింత ధైర్యంతో స్కూలు నిర్వాహకులు తమకు ఉన్న బస్సుల్లోనే ఎక్కువ మంది విద్యార్థులను ఎక్కించి పంపించి వేస్తున్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగినప్పుడు మాత్రమే అధికారులు హడావుడిగా రోడ్డెక్కి తనిఖీలు చేస్తున్నారు. కొన్ని ప్రైవేటు స్కూలు బస్సులు నిబంధనల ప్రకారం తమ బస్సులను నడుపుతుండగా మరికొందరు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా తమకేమీ పట్టనట్లు బస్సులను నడుపుతున్నారు. పైన పటారం లోన లొటారం అనే విధంగా కొన్ని బస్సులు కనిపిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల్లో ఘాటీల్లో తిరిగిన బస్సులు తక్కువ ధరకు రావడంతో కొంత మంది కొనుగోలు చేసి ఈ ప్రాంతాలకు తీసుకు వస్తున్నారని తెలుస్తోంది. ఇలాంటి బస్సులకు అధికారులు యథావిధిగా ఫిట్‌నెస్ ఇచ్చేస్తున్నారు. ఈ బస్సులకు అకస్మాత్తుగా స్టీరింగ్ వదిలి వేయడం, బ్రేకులు ఫెయిల్ అవ్వడం జరుగుతున్నాయని చెప్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని వారి ప్రయాణానికి సౌకర్యవంతంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

తనిఖీలు చేసి కేసులు రాస్తున్నాం



ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ 1165 స్కూలు బస్సులకు ఫిట్‌నెస్ జారీ చేశాం. మరో 15 బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉంది. గతంలో ఫిట్‌నెస్ పొందిన 150 బస్సులు 15 ఏళ్ల గడువు తీరిపోవడంతో వాటిని నిలిపివేశాం. స్కూలు తెరిచిన తరువాత స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రూ. లక్షా 80 వేల రూపాయల జరిమానాలు విధించాం. స్కూలు, కాలేజీ విద్యార్థులను సురక్షితంగా వారి గమ్యానికి చేర్చాల్సిన బాధ్యత స్కూలు యాజమాన్యం, డ్రైవర్లపై ఉంది. ప్రతి బస్సు క్షుణ్ణంగా తనిఖీలు చేసి ఫిట్‌నెస్ జారీ చేస్తున్నాం. జిల్లాలోని స్కూలు బస్సు డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన సదస్సును త్వరలో నిర్వహిస్తాం. ఆటో డ్రైవర్లకు కూడా అవగాహన సదస్సు నిర్వహిస్తాం. ఆ తరువాత స్పెషల్ డ్రైవ్ చేపట్టి చర్యలు తీసుకుంటాం. నిబంధనల ప్రకారం అనుమతికి మించి ఎవరైనా విద్యార్థులను బస్సులో కాని, ఆటోలో కాని ఎక్కించుకుంటే వారిపై కేసులు నమోదు చేస్తాం. జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తాం.

- షేక్ కరీమ్, ఉపరవాణా కమిషనర్, ఏలూరు జిల్లా

సీపీఐ మహాసభలు విజయవంతం చేయాలి

తణుకు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19, 20 తేదీలలో తణుకులో జరిగే సీపీఐ 27వ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. శనివారం అక్కమాంబ టెక్స్‌టైల్స్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, కష్టజీవుల అభ్యున్నతి కోసం వందేళ్ళుగా నిర్విరామంగా ఉద్యమిస్తున్న పార్టీ సీపీఐ అన్నారు. 19న పట్టణంలో ప్రజా ప్రదర్శన, బహిరంగ సభల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అన్నారు.

ఒంగోలులో రాష్ట్ర మహాసభలు

చింతలపూడి, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): శ్రమజీవుల శమర శంఖారావం పేరుతో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో జరుగుతాయని సీపీఐ మండల కార్యదర్శి టి.బాబు తెలిపారు. ఈ మహాసభల పోస్టర్‌ను కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లు కావస్తున్నా రైతాంగానికి అమలు చేస్తానన్న స్వామి నాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయలేదన్నారు. ఈ రాష్ట్ర మహాసభల్లో అనేక విషయాలు తీర్మానం చేస్తామని, సభలు జయప్రదం చేయడానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. సీపీఐ నాయకులు కంచర్ల గురవయ్య, దొంత కృష్ణ, ఎస్.కె.కాలేషా, ఎం.అలెగ్జాండర్, కొవ్వూరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు కోసం..

25న విజయవాడలో మహాధర్నా

ఏలూరు అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం స్థానిక డీఈవో కార్యాలయం వద్ద మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఓపీఎస్ (పాత పెన్షన్)సాధన సమితి రాష్ట్ర కన్వీనర్లు కె.ఎల్.శ్రీనాథ్, కట్టా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన పెన్షన్ విధానం(సీపీఎస్) 2004 సెప్టెంబరు 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని, ఆ మేరకు సీపీఎస్ అమల్లోకి వచ్చిన తేదీ కంటే ముందుగా నియామకాల నోటిఫికేషన్లు విడుదలై, సెప్టెంబరు 1వ తేదీ తర్వాత నియమకాలు జరిగి ప్రస్తుతం సీపీఎస్ విదానంలో కొనసాగుతున్న సుమారు 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఉత్తర్వుల ప్రకారం పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వాలతో అనేక మార్లు ప్రాతినిధ్యం జరిపినా స్పందన లేకపోవడం వల్లే ఉద్యమ కార్యాచరణకు మళ్లీ దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ నెల 25న విజయవాడలోని ధర్నా చౌక్ సెంటర్‌లో నిర్వహించే మహాధర్నాకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ సీహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మెమో ఉత్తర్వులకు స్పందించి దేశంలో ఇప్పటికి 16 రాష్ట్రాల్లో పాతపెన్షన్ పునరుద్ధరించారని, రాష్ట్రంలో మాత్రం ఓపీఎస్ అమలుకు నిర్ణయం తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు స్పందించి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్.హరనాథ్, ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మోహన్, ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు ప్రకాశ్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారావు, ఉపాధ్యాయుల ఫోరం జిల్లా కన్వీనర్లు జగదీశ్, శంకర్రావు, సభ్యులు గోపాలకృష్ణ, శ్రీనివాసరావు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయం వద్ద పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

పార్కింగ్ చేసిన కారు నుంచి మంటలు

తణుకు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తణుకు పట్టణంలో పార్కింగ్ చేసిన కారు నుంచి మంటలు వ్యాపించడంతో కారు దగ్ధమైంది. ఈ సంఘటన శనివారం జరిగింది. ఇరగవరం మండలం కంతేరు గ్రామానికి చెందిన రిషి అనే వ్యక్తి కారు పార్కు చేసి బ్యాంకు కాలనీ ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. ఆస్పత్రికి వెళ్లి వచ్చేసరికే కారులో మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదం షార్టు సర్క్యూట్ కారణంగా జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉంగుటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి):మోటార్ సైకిల్ అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలతో యువకుడు మృతి చెందాడు.మండలంలోని ఉప్పాకపాడు గ్రామానికి చెందిన దయాలె సురేశ్(36)అనే యువకుడు ఈ నెల 12న శ్మశానం వద్ద ఉన్న మలుపులో మోటారు సైకిల్ అదుపుతప్పి పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. దీంతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కామినేని ఆసుపత్రికి అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

కొవ్వూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. యలమంచిలి మండలం మట్లపాలెం గ్రామానికి చెందిన బొక్కా రత్నరాజు (45) కొవ్వూరు మండలం కుమారదేవంలో గోదావరి గట్టుపై ఉన్న గెస్ట్‌హౌస్‌లో పని చేస్తున్నాడు. శనివారం విద్యుత్ మోటారును పైకి తీస్తుండగా మోటారు జారిపడి వైర్లపై పడటంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.కొవ్వూరు ఎస్ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, శవపంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ విభేదాల కారణంగా పదేళ్లుగా విడిగా ఉంటున్నాడు. సోదరుడి కుమారుడు బొక్కా లక్ష్మణ్ అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

ఐరన్ పైపునకు ఉన్న జెండాను విప్పుతూ మరొకరు..

ఉంగుటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర్య వేడుకల నిమిత్తం ఏర్పాటు చేసిన జెండా ఐరన్ పైపును దించుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురికావడంతో స్వీపర్ భర్త మృతి చెందాడు. ఉంగుటూరు మండలం వెల్లమిల్లిలోని పాఠశాల వద్ద శుక్రవారం ఉదయం జాతీయ జెండాను ప్రధానోపాధ్యాయురాలు చలంచర్ల కోట సత్య నాగలక్ష్మీ రాణి తన సహోపాధ్యాయులతో జెండాను ఎగురవేశారు. అదే రోజు సాయంత్రం ఆ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న ఉసురుమర్తి పుష్ప భర్త ఉసురుమర్తి భీమరాజు(49)ను జెండా కిందికి దించేందుకు రప్పించారు. ఆ జెండాను కిందికి దించే క్రమంలో పైపు 11 కేవీ విద్యుత్ లైన్‌కు తగలడంతో భీమరాజుకు షాక్ తగిలింది. విద్యుదాఘాతంతో కిందపడిపోయిన భీమరాజుకు స్థానికులు గుర్తించి సీపీఆర్ చేసినా ఫలితం దక్కలేదు. భీమరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. భర్త అర్ధంతరంగా చనిపోవడంతో పుష్ప గుండెలు పగిలేలా రోదిస్తోంది. ఫిర్యాదు మేరకు ఎస్.ఐ. మామిడాల సూర్యభగవాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం పై కేసు నమోదు

టి.నర్సాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. ఎం.జయబాబు తెలిపారు. ఏపిగుంట పంచాయతీలోని బచ్చులేటిగూడెం గ్రామానికి చెందిన పొడియం రవి (35)కి వివాహమైంది. ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. భార్యభర్తల మధ్య గొడవల కారణంగా రవి భార్య మండలంలోని కుట్రేపు గ్రామంలో పుట్టింటి వద్ద ఉంటోంది. రవి అప్పుడప్పుడు భార్య దగ్గరకు వెళ్లి తిరిగి వస్తుండేవాడు. ఈ నెల 11న ఉదయం మోటర్‌సైకిల్‌పై ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్.ఐ. జయబాబు తెలిపారు.

గంజాయిని తరలిస్తున్న ముఠా అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ విల్సన్

భీమడోలు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్టు భీమడోలు సీఐ విల్సన్ తెలిపారు. ఈ నెల 15న భీమడోలు మండలం పోలసానపల్లి బ్రిడ్జి సమీపంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా, ద్వారకాతిరుమల నుంచి భీమడోలు జంక్షన్ రోడ్డులో రెండు మోటారు సైకిళ్లతో వెళ్తున్న నలుగురిని తనిఖీ చేయగా రెండు కేజీల 13 గ్రాముల గంజాయిని గుర్తించామన్నారు. పాడేరు నుంచి గంజాయి తీసుకొస్తున్నట్టు సీఐ తెలిపారు. ఉంగుటూరు మండలం చేబ్రోలుకు చెందిన మోటుకూరి శ్యామ్యూల్, కైకరం గ్రామానికి చెందిన దొడ్డి లక్ష్మీ నారాయణ, నల్లజర్ల మండలం పుల్లల పాడుకు చెందిన దిరిసిపాము నిషాంత్, ముసళ్ళకుంట గ్రామానికి చెందిన చీర రవి బాబులుగా పోలీసులు గుర్తించారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆలమూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పెదపళ్ల వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన వల్లూరి సాయినిరంజన్(28) కొత్తూరు సెంటర్ నుంచి అచ్యుతాపురం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పెదపళ్ల సమీపంలో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన సాయి నిరంజన్‌ను రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కపిలేశ్వరపురం ఎస్ఐ జి.నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అత్తవారు ఇంటి నుంచి వెళ్తూ..



సాయినిరంజన్(ఫైల్)

రోడ్డుప్రమాదంలో మృతి చెందిన సాయినిరంజన్ తణుకు అత్తవారింటికి వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పెదపళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న సాయి నిరంజన్‌కు గత ఏడాది ఆగస్టు 23న వివాహమైంది. ఏడాది కాకుండానే మృత్యువాత పడటంతో బంధువులు బోరున విలపిస్తున్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దు

విద్యార్థులకు పోలీసుల హితవు

ఏలూరు క్రైం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు యువత సహకరించాలని ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు అన్నారు. ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, శక్తి టీమ్ సభ్యులు కలిసి ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్ విద్యార్థులకు కాలేజీ గ్రౌండ్‌లో శనివారం సాయంత్రం డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు నెరవేర్చాలని ఆకాంక్షించారు. విద్యార్థి డ్రగ్స్‌కు అలవాటుపడితే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. అలాంటి విద్యార్థులను గుర్తించి కౌన్సెలింగ్ చేస్తామన్నారు. కేసుల భయంతో చాలా మంది విద్యార్థులు ఇలాంటి విషయాలను దాచి వేస్తున్నారని దీని వల్ల ఎంతో మంది విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. సమాచారం ఇస్తే ఎలాంటి కేసులు నమోదు చేయమని అన్నారు. విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండాలని,ఎవరైనా మత్తుపదార్థాలతో వ్యాపారం చేసినా, వినియోగించినా 112 కాని 1972 నెంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. తోటి స్నేహితుల భవిష్యత్తును కాపాడాలన్నారు.



సెల్ ఫోన్ కోసం భక్తుల పడిగాపులు

ద్వారకాతిరుమలలో సెల్ ఫోన్ డెలివరీ పాయింట్ వద్ద రగడ

» చేతులెత్తేసిన పాటదారుడు
» సిబ్బందికి తప్పని ఇబ్బందులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవస్థానంలో సెల్‌ఫోన్ డెలివరీ పాయింట్ నిర్వహణను ఓ కాంట్రాక్టరు అర్ధంతరంగా వదిలేయడంతో రంగంలోకి దిగిన ఆలయ సిబ్బంది సక్రమంగా నిర్వహించలేకపోయారు. దీంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఆలయానికి వచ్చిన భక్తుల సెల్ ఫోన్‌లు భద్రపరించేందుకు జరిగిన వేలంపాటలో ఓ పాటదారుడు దానిని రూ.1.80 కోట్లకు పాటదారుడు దక్కించుకున్నాడు. అయితే పాట జరిగి రెండు నెలలైనా అతను నిర్వహించేందుకు ముందుకు రాలేదు. దీంతో అంతకు ముందు పాటదారుడిని బతిమాలి దేవస్థానం కొద్ది రోజులుగా సెల్ ఫోన్ల భద్రత చేయిస్తోంది. అతను కూడా చేతులెత్తేయడంతో శనివారం వచ్చిన భక్తుల ఫోన్లను భద్రపరిచేందుకు ఆలయ అధికారుల సూచనల మేరకు దేవాలయ సిబ్బంది రంగంలోకి దిగారు. సిబ్బందికి నిర్వహణ సాధ్యం కాకపోవడంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఆప్రాంతంలో ఎక్కువ మంది నిలిచిపోవడంతో గందరగోళం ఏర్పడింది.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి

ఆర్టీసీ వైస్ చైర్మన్ మణిరత్నం

నరసాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి); ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా సంస్థ సిబ్బంది పని చేయాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మణిరత్నం కోరారు. శనివారం ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ చైర్మన్ ఎస్.రాజశేఖర్, ఏపీ మత్స్యకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజులతో కలిసి ఆయన డిపోను సందర్శించారు. బస్సులు నడుస్తున్న సర్వీసు రూట్లు, రోజు వారి ఆదాయం, ఉచిత బస్సుల అమలు తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం కార్మికులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని సిబ్బంది పటిష్టంగా అమలు చేయాలన్నారు. అన్ని డిపోల్లో సర్వీసుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.డీఎం సుబ్బన్న రెడ్డి, కౌన్సిలర్ పాలూరి బాబ్జీ, కొప్పాడ రవి, షేక్ హుసేన్, వైదాని నాగేశ్వరరావు, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా నిత్యావసరాల పంపిణీ

ఉంగుటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురానికి చెందిన యువకుడు గుణ్ణం రుషి తన తండ్రి మాజీ సర్పంచ్ గుణ్ణం రామచంద్రరావు జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముందుకు ఆయన విగ్రహానికి పూలమాల వేసి చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేదలకు, 50 మంది హెచ్ఐవీ బాధితులతో పాటు, ఉంగుటూరు అనాథాశ్రమం పిల్లలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. సర్పంచ్ దిడ్ల అలకనంద, రంగా యువసేన నాయకుడు వెజ్జు సుబ్బారావు, నల్లా ఆనంద్, రావూరి మహేష్, గోలి బాలాజి పాల్గొన్నారు.

శ్రీవారికి తులసీ దళాలతో ప్రత్యేక పూజలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): నగరంలోని రామచంద్రరావుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు స్వామికి తులసీదళాలు, పుష్పాలతో ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. భగవద్గీత పారాయణ మండలి సభ్యులు సామూహికంగా భగవద్గీతను పఠించారు. తొలుత స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, వేంకట పవనకుమారాచార్యులు పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులు ఇచ్చి భక్తులకు దర్శనమిచ్చారు.

ఉద్యోగులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలి: ఏపీజీఈఏ

ఏలూరు అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ)కి రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గుర్తింపునిచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆ సంఘ జిల్లా శాఖ నాయకులు ఏలూరులోని జిల్లా కార్యాలయంలో శనివారం ఓ కార్యక్రమం నిర్వహించారు.ఏపీజీఈఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, బంగారయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.30 వేల కోట్లకు చేరుకున్నాయని, వాటిని చెల్లించడానికి మార్గాలను ప్రభుత్వానికి సూచించామన్నారు. జూలై 2023నుంచి 12వ పీఆర్సీ కమిటీని నియమించాల్సిఉందని, తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, ఈలోగా 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏ బకాయిలు చెల్లించాలని, వెంటనే 2 డీఏలను మంజూరుచేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యలు, వ్యాజ్యాల విచారణ కోసం అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై వారుపనిచేస్తున్న కార్యాలయాలకేవెళ్లి చైతన్య పరుస్తున్నామన్నారు.సమావేశంలో గోవిందరావు, శ్రీనివాసరావు, జాహెద్, నీలిమాదేవి, గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


పొగాకు బ్యారన్లు రెన్యువల్ చేయించుకోవాలి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): 2025-26 నుంచి 2028వ సంవత్సరం పొగాకు పంట కాలం వరకు బ్యారన్ లైసెన్సులను ఈ నెల 18 నుంచి అక్టోబర్ 22 వరకు రైతులంతా రెన్యూవల్ చేయించుకోవాలని జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారులు జె.సురేంద్ర, బి.శ్రీహరి శనివారం తెలిపారు. అనధికారికంగా బ్యారన్లు నిర్మిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. బ్యారన్ల లీజులు, బదిలీలు మూడేళ్ల కొకసారి మాత్రమే చేస్తామని తెలిపారు. అక్టోబర్ 23 నుంచి నవంబర్ ఏడవ తేదీ వరకు రూ.వంద అపరాధ రుసుంతో బ్యారన్లు రెన్యువల్ చేస్తామని, నవంబర్ ఎనిమిది నుంచి 19వ తేదీ వరకు రూ.400 అపరాధ రుసుంతో రెన్యువల్ చేయించుకోవచ్చని, అనంతరం వచ్చే దరఖాస్తులు స్వీకరించేది లేదని తెలిపారు. గడువు లోపు రెన్యువల్ చేయించుకోవాలన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని చిట్టూరి గణేశ్వరరావు టౌన్ హాల్లో నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ పిలుపునిచ్చారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదేశాల మేరకు ఉదయం తొమ్మిది గంటల నుంచి ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. టెన్త్ నుంచి డిగ్రీ చదివిన 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనాలని కోరారు. అనంతరం జాబ్ మేళా ప్రచార పత్రికలను ఆవిష్కరించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, మద్దిపాటి నాగేశ్వరరావు, గుమ్మడి ప్రసాద్, మానికల నాగేశ్వరరావు,షేక్ యాకూబ్, కోనేటి చంటి, గెడా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిధుల కోసం మంత్రి లోకేశ్‌కు ఎంపీ మహేశ్ విజ్ఞప్తి



ఏలూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి):మంత్రి నారాలోకేష్‌ను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ఉండవల్లిలో ఆయన నివాసంలో కలిసి ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిపై శనివారం చర్చించారు. పలు అంశాలపై వినతి పత్రం ఇవ్వగా మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు. వేలేరుపాడులో ఏకలవ్యమోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని, నూజివీడు ఐఐటీకి రూ.12 కోట్ల 17 లక్షలు, ఏలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 12కోట్ల 60 లక్షలు, ఏలూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థకు నూతన భవనం నిర్మాణానికి రూ.3కోట్లు మంజూరు చేయాలని ఎంపీ కోరారు. కొయ్యలగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఒక ఫైర్ స్టేషన్ మంజూరు చేయాలని వినతిలో పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ నిధుల విడుదలలో ఆలస్యం, పామాయిల్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ, కోకో రైతుల సమస్య, సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ కొల్లేరు రిపోర్టు అందించడం, పెండింగ్‌లో ఉన్న సత్యసాయి సీపీడబ్ల్యుఎస్ స్కీమ్ వర్కర్ల జీతాలు తదితర అంశాలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని మంత్రి లోకేష్‌కు ఎంపీ బహూకరించారు. వీటినన్నింటిని త్వరగా పరిష్కరిస్తానని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

సీజనల్ వ్యాధులపై సీఆర్ఆర్ విద్యార్థుల అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

పెదపాడు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో యూబీఏ సెల్ ఆధ్వర్యంలో మాన్సూన్ హైజిన్ కార్యక్రమంపై శనివారం అవగాహన కల్పించారు. వర్షాకాలంలో పరిశుభ్రతను కాపాడుకోవడం, ఇంటి చుట్టుపక్కల పరిసరాల్లో నీటిని నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని యూబీఏ సెల్ కో-ఆర్డినేటర్ ఎ.జ్యోతి తెలిపారు. డెంగీ, మలేరియా వంటి దోమల నివారణపై అవగాహన అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు స్థానిక గ్రామస్థులతో కలిసి ఆరోగ్య సూచనలు తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు.


సమీక్షలో మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

నేరస్థులు తప్పించుకోకూడదు : ఏఎస్పీ


సమీక్షలో పాల్గొన్న పోలీసులు

ఏలూరు క్రైం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నేరస్థులకు శిక్షలు పడేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ ఆదేశాలతో ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో కోర్టు మానిటరింగ్ సభ్యులతో సమీక్షను అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నేరస్థులు శిక్ష నుంచి తప్పించుకోకూడదని, బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రతి రోజు కోర్టుల్లో జరిగే ప్రక్రియను డాక్యుమెంట్ చేసి స్టేషన్ అధికారికి నివేదిక అందించాలన్నారు. కోర్టు మోనటరింగ్ సెల్ సభ్యులు నిర్లక్ష్యం లేకుండా విధులను నిర్వర్తించాలన్నారు. కేసు విచారణ వేగవంతంగా జరగడానికి సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపర్చాలని సూచించారు. డీటీసీ డీఎస్పీ ప్రసాదరావు, కోర్టు మోనటరింగ్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అబీబ్‌బాషా పాల్గొన్నారు.

జోరుగా..హుషారుగా!

(5వ పేజీ తరువాయి)

సూచనలు చేశారు. సెల్‌ఫోన్లలో చూపించడం కాదని, ఆధార్, రేషన్, ఓటర్ ఐడీ, స్టూడెంట్ గుర్తింపు కార్డులను చేతపట్టుకుని రావాలని ఓపిగ్గా వివరించారు. ప్రధానంగా ఏలూరు - ద్వారకాతిరుమల, ఏలూరు-రావులపాలెం, కొవ్వూరు- రాజమండ్రి, ఏలూరు- రాజమండ్రి బస్సుల్లో ప్రయాణికులు ఓ మోస్తరు ప్రయాణాలు చేశారు. తణుకు నుంచి వయా విజయవాడ, గుంటూరు సర్వీసుల్లో మహిళా ప్రయాణికుల సందడి కనిపించింది.

నేడు రెట్టింపు ప్రయాణాలకు అవకాశం..

ఉచిత బస్సు అమలు చేయకముందే వరుస సెలవులతో గురువారం నాడే ప్రయాణాలు చేసిన వారు తమ స్వగ్రామాలకు తిరుగుముఖం పట్టాల్సి ఉంది. దీంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి రెట్టింపు ప్రయాణాలు సాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు పడరాదని సీఎం సూచనలతో రాత్రి 10 గంటల తర్వాత కూడా డిపోల నుంచి బస్సుల్లో మహిళలను గమ్యస్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.


కొయ్యలగూడెంలో ఉట్టికొడుతున్న నాయకులు



నిడమర్రులో ప్రత్యేక పూజలు, ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ


ఏలూరు గోరక్షణ సమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి దృశ్యం

ఉట్టి కొట్టిన చిన్ని కృష్ణులు

దెందులూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఆచార, సాంప్రదాయాల పరిరక్షణకు టీడీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఏలూరు ఎంపీ మహేష్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. మండలంలోని చల్లచింతలపూడిలోని యాదవులపేటలో జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమిని వేడుకల్లో ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొన్నారు. శనివారం శ్రీకృష్ణ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు ముమ్మడి చింతయ్య యాదవ్‌లు, వడ్డీ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ ఘంటశాల వెంకటలక్ష్మీలతో కలిసి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. అలాగే పోతునూరులో శ్రీకృష్ణ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. టీడీపీ గ్రామాధ్యక్షులు నున్న లక్ష్మణ్, బ్యాంక్ అధ్యక్షులు మోహన్‌బాబు, యాదవ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కృష్ణుడి రథాన్ని నడిపారు. యాదవ్ సంఘం నాయకులు డొక్కు వెంకటేశ్వరరావు ఉన్నారు.

● పోలవరం: పోలవరం మండలంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పోలవరం, పట్టిసీమ, గూటాల, కొత్తపట్టిసీమ, ప్రగడపల్లి, రేపల్లెవాడ, ఎల్లండిపేట,నూతనగూడెం గ్రామాల్లో యువకులు ఉట్టికొట్టే ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు శివారున నూతనంగా నిర్మించిన ఇస్కాన్ ఆలయానికి మహిళలు తరలి వెళ్లారు. కృష్ణాష్టమి సందర్భంగా పట్టిసీమ శ్రీసుదర్శన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు

జిల్లా వ్యాప్తంగా ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

నిర్వహించారు.సుమారు ఐదువేల మంది భక్తులు ఆలయ దర్శనానికి వచ్చినట్లు ఆలయ అర్చకులు శంకరమంచి వెంకట్రామశర్మ తెలిపారు.

● ఉంగుటూరు: మండలంలో కృష్ణాష్టమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద్దిరెడ్డి శేషవేణి వేణు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ వేషధారణ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ట్రస్టు చైర్మన్ ముత్తంగి వేణుగోపాల కృష్ణ ప్రసాద్, కొచ్చర్లకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● భీమడోలు: మండలంలో భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానపల్లి తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. భీమడోలు గొల్లల వారి వీధిలో నూతనంగా నిర్మించిన కృష్ణుడి ఆలయంలో పూజలు నిర్వహించారు. భీమడోలు ఎస్ఐ సుధాకర్, ఏఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి, కొరిపర్తి ఆంజనేయులు, గ్రామస్థులు, ఆలయ కమిటీ పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.

● ఏలూరుకార్పొరేషన్: నగరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆయా డివిజన్ల ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు.రామచంద్రరావుపేటలోని గోసంరక్షణ ప్రాంగణంలో చిన్నారులతో శ్రీకృష్ణుడి అలంకార పోటీలు నిర్వహించారు.

● నిడమర్రు: శ్రీకృష్ణాష్టమి వేడుకలు మండలంలో వాడవాడలా వైభవంగా నిర్వహించారు. మండలంలో భువ్వనపల్లి, నిడమర్రు గ్రామాల్లో ఉన్న శ్రీకృష్ణదేవాలయాల్లో స్వామిని విశేషంగా అలంకరించారు. భువ్వనపల్లిలో ఉన్న శ్రీకృష్ణదేవాలయాలన్ని మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కుటుంబ సమేతంగా సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● పెదపాడు: పెదపాడు, గుడిపాడు, వడ్డిగూడెం, కొత్తూరు, అప్పనవీడు, వట్లూరు గ్రామాలతో పాటుగా పలుచోట కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కొత్తూరులో కృష్ణాష్టమిని పురస్కరించుకుని అన్నదానం నిర్వహించారు. పలుచోట్ల సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా చేపట్టారు.

● టి.నర్సాపురం:మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని మక్కినవారిగూడెం, వెలగపాడు,వీరభద్రవరం, రాజుపోతేపల్లి, టి.నర్సాపురం, బండివారిగూడెం తదితర గ్రామాల్లో ఆలయాల వద్ద భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టి.నర్సాపురంలో శ్రీఅన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద మహిళా భక్తులు శ్రీకృష్ణుడిని ప్రత్యేక అలంకరణలో అలంకరించి గీతాపారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

● కొయ్యలగూడెం: కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని మదన గోపాలస్వామి ఆలయంలో ఉట్టికొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండలంలోని బయ్యన్నగూడెం, కన్నాపురం, యర్రంపేట, రాజవరం తదితర అన్ని గ్రామాల్లోనూ ఉట్టికొట్టారు.

● ఏలూరురూరల్:ఏలూరు ఏటిగట్టులోని యాదవ సంఘం భవన్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఏలూరు ఎంపీ పుట్టామహేశ్ యాదవ్, ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొన్నారు. శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. సంఘ అధ్యక్షుడు చింతయ్య, నగర అధ్యక్షుడు మెరుగుమాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న స్ఫూర్తి ప్రదాత


విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరుసిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఏలూరులోని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గౌతు లచ్చన్న చిత్రపటానికి జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ గౌతు లచ్చన్న స్వాతంత్ర్య సమరయోధుడిగా, పేదల పక్షపాతిగా ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచారని ఆమె కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలివ్వడం సుభపరిణామం అన్నారు. టిడిపి నేత ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు. అనంతరం

పోరాట యోధుడికి ప్రముఖుల నివాళి

జడ్పీ చైర్ పర్సన్ పద్మశ్రీ దంపతులు తంగెళ్ళమూడిలోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయాన్ని సందర్శించుకున్నారు. జడ్పీటీసీ సభ్యులు పోలినాటి శ్రీనివాసరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: ఏలూరు 2వ డివిజన్‌లోని గౌతు లచ్చన్న స్మారక భవనంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొని లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.శంఖ బాలయోగి, పుష్పా రాంబాబు, సింగవరపు ప్రసాద్, తీయాల రవి, లొట్టి రమేష్, నొడగాని సురేష్, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి పాల్గొన్నారు. తంగెళ్ళమూడిలో ఏపీ బీసీ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిట్టిబొమ్మ రంగారావు, బీసీ కులాల జేఏసీ అధ్యక్షులు లంక వెంకటేశ్వరరావు, బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పామర్తి ఏసురాజు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి,



నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, తదితరులు

ఉక్కుసూరి గోపాలకృష్ణ, మరగాని శ్రీనివాసరావు, బీసీ నాయకులు అశోక్ గౌడ్, పామర్తి అచ్యుత్, వీరంకి త్రినాథ్, ఎం.వి.సుబ్బారావు, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

● ఏలూరు: లింగపాలెంలో గౌతులచ్చన్న జయంతిని బీసీ సెల్ అధ్యక్షుడు తాళం సోంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. చిలకబత్తుల వీరభద్రరావు, పామర్తి సుబ్బారావు, చిలుకబత్తుల ప్రభాకర్, పామర్తి వెంకటేశ్వరరావు, అయ్యప్ప, గజ్జల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాం చంద్రశేషు ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, సొసైటీ సభ్యుడు తాళ్లూరి వెంకటేశ్వరరావు, బూసా సత్యనారాయణ రెడ్డి,రాగాని శ్రీనివాసరావు,రాగాని రామకృష్ణ పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న కార్మిక సంఘాలు

కార్మిక సంఘ కమిటీ ఎన్నిక

టి.నర్సాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆయిల్ పామ్ కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నికను స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సంఘం జిల్లా నాయకులు టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో 10వేల మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా నాగరాజు, కార్యదర్శి సత్యనారాయణ కమిటీ సభ్యులను టి.నర్సాపురం, కే.జగ్గవరం, బంధంచర్ల, మల్లప్పగూడెం, వెంకటాపురం, వీరభద్రవరం, మక్కినవారిగూడెం, సూరంపూడి గ్రామాలకు చెందిన కార్మికులను ఎన్నుకున్నారు. ఈ నెల 19న ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో అన్ని గ్రామాల కార్మికులు పాల్గొనాలని నాయకులు కోరారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

జీలుగుమిల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్.ఐ. వి.క్రాంతికుమార్ అన్నారు. బర్రింకలపాడు ఏపీ గిరిజన బాలుర గురుకుల పాఠశాల్లో విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టం, శక్తి యాప్ పై అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకుని ఎదుటివారికి ఆదర్శంగా నిలవాలన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ఏలూరు రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సత్రంపాడు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్రంపాడులోని ఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు సుధీర్ బాబు చేతుల మీదుగా అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు ప్రసాద్, వాకర్స్ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ ఆదినారాయణ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

చిరు అభిమానుల సేవలు

ఏలూరురూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్ఫూర్తివంతమైన సేవలను ముందుకు తీసుకువెళ్లడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.మెగాస్టార్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో మాదేపల్లి రోడ్డులోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలోని శనివారం భోజనాలు ఏర్పాటు చేశారు.ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోన్-2 చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, ఈడా చైర్మెన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మెన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఎన్‌గ్రూప్ అధినేత నారాశేషు, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎమ్మార్ పెదబాబు, చిరంజీవిఫ్యాన్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మారం అను, అధ్యక్షులు, శానం రామకృష్ణ , జగన్, సురేశ్‌మాస్టర్, పవన్, పెదబాబు, ఆది, అరవింద్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అభిమానులు..

చిరంజీవి జన్మదినోత్సవంలో భాగంగా శనివారం చిరంజీవి యువత, ఏలూరు మెగా ఫ్యామిలీ ఆధ్వర్యంలో బడేటి పార్కులో మొక్కలు నాటారు. జనసేన నాయకులు నారా శేషు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈనెల 22వ తేదీ వరకు చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శానం శ్రీరామకృష్ణ తెలిపారు. ఆదివారం మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మారం హనుమంతరావు, పి.జగన్, ఇ. పవన్, పి.పండు, డి.పెదబాబు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

ఏలూరు, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): మండలంలో పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెంలో కొందరు వ్యక్తులు పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ కె.వెంకన్న సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఈ సందర్భంగా ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 15 వేలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

బకాయి జీతాల కోసం ఎంపీకి వినతి

పోలవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జీతాల బకాయిల చెల్లించాలంటూ సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికులు జనసేన పార్టీ మండలాధ్యక్షులు గునపర్తి చిన్ని, వీరమహిళ మామిడిపల్లి స్వాతి ఆధ్వర్యంలో శనివారం టి.నరసాపురంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజులను ఆశ్రయించారు. సత్యసాయి మంచినీటి పథకం 2021 జూన్ నుంచి 15వ తేదీ ఆగస్టు రెండో తేదీ వరకు నిర్వహణ బాధ్యతల నిమిత్తం కాంట్రాక్టరు నుంచి పది నెలల జీతాలు అందాల్సి ఉందని ఎంపీ, ఎమ్మెల్యేలకు తెలిపారు. అలాగే గతంలో అందాల్సిన 45 రోజుల పాటు బకాయిలు ఇప్పించాలని కోరారు.సత్యసాయి మంచినీటి సరఫరా కార్మికులు రవీంద్ర, శ్రీకాంత్, శ్రీనివాస్, పోసిబాబు, శివ పాల్గొన్నారు.

సొసైటీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

కామవరపుకోట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను పటిష్టపరిచి రైతులకు, సభ్యులకు మెరుగైన సేవలందించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటామని ఆప్కాబ్, డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. శనివారం తడికలపూడి సొసైటీ చైర్మన్‌గా తూతా బాలాజీ కుమార్ త్రిసభ్య కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. కామవరపుకోట సొసైటీ చైర్మన్‌గా ఘంటా మాధవరావు,కమిటీ సభ్యులుగా జోనుబోయిన నారాయణరావు (అబ్బులు)తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, బిజెపి నాయకులు బాహుబలేంద్రుని బాలవర్ధిరాజు పాల్గొన్నారు.

● ఏలూరు : లింగపాలెం టీడీపీ మండల అధ్యక్షుడు గిరిమళ్ల చలపతిరావు ఆధ్వర్యంలో మోరంపూడి మల్లికార్జునరావు, నిమ్మగడ్డ సుధాకర్, మండదపు లక్షణ్‌ప్రతాప్, ఇనుగంటి దినేశ్‌లు డీసీసీబీ కోఆపరేటివ్ చైర్మన్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులును కలిశారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఉచిత బస్సు ప్రయాణం వర్తింపజేయండి

కుక్కునూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు పథకాన్ని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల మహిళలకు అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పొన్నే లక్ష్మయ్య, వరకా శ్యామల, బాబురావు, వెంకటాచారి డిమాండ్ చేశారు. కుక్కునూరు నుంచి భద్రాచలం వెళ్లాలంటే తెలంగాణ సరిహద్దు పథకం అమలు సమస్యగా మారిందన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

వాజపేయికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న విక్రమ్ కిశోర్, రాంబాబు

ఏలూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజపేయి వర్ధంతి సభ ఏలూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ హాజరై వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాది రాంబాబు, అగ్రహారం వెంకటేశ్వరరావు, నాగం శివ, బాడిది నారాయణరావు, పాలరమణ, గణేష్, గొంతిన సర్వేశ్వరరావు, చలమల సత్యనారాయణ ప్రక్కి మహేష్‌లు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ నిలిచిపోయే ప్రాంతాలు

ఉంగుటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కేవీ పనుల నిమిత్తం బాదంపూడి రూరల్ ఫీడర్‌కు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖాధికారి అంబేడ్కర్ తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు రావులపర్రు, రామారు, సీతారాంపురం గ్రామాల చేపల చెర్వులకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందన్నారు.


అవార్డు అందుకుంటున్న కృష్ణారెడ్డి, గాంధీ

ఆర్టీసీ డ్రైవర్‌కు ఉత్తమ అవార్డు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో డ్రైవరుగా పని చేస్తున్న బి.కృష్ణారెడ్డి తన ముప్పై ఏళ్ల సర్వీసులో జీరో యాక్సిడెంట్‌గా విధులు నిర్వహించినందుకు శుక్రవారం ఏలూరులో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. మంత్రితో పాటు జిల్లా కలెక్టరు వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్,జేసీ ధాత్రిరెడ్డి ఉన్నారు. జిల్లా రవాణాధికారిణి షేక్ షబ్నం, జంగారెడ్డిగూడెం డిపో మేనేజరు పివిఎల్ఎల్. గంగాధరరావు కృష్ణారెడ్డిని అభినందించారు.

పశుసంవర్థక శాఖలో గాంధీకి..

ఏలూరు రూరల్:స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లా పశుసంవర్థక శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆ శాఖ సహాయక అధికారి ఇ.గాంధీ మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ వైద్యాధికారిగా అవార్డు అందుకున్న గాంధీని ఆ శాఖ ఉద్యోగులు అభినందించారు.



టీడీపీలో మహిళల చేరిక

కొయ్యలగూడెం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక తారక రామనగర్‌కు చెందిన పలువురు మహిళలు టీడీపీ మహిళా ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి గంగిరెడ్ల మేఘలా దేవి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ మేరకు ఆ మహిళలకు ఆమె పసుపు కండువాల వేసి పార్టీలోకి ఆహ్వానించారు.మహిళలకు ఉచిత బస్సు వంటి పలు పథకాలు అందిస్తున్న నేపథ్యంలో మహిళలు పార్టీలో చేరుతున్నారని ఆమె అన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి టీడీపీ ఎంతో దోహదపడుతుందని గుర్తుచేశారు. టీడీపీ మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సేవకుడు బొలిశెట్టి శ్రీనివాస్

ఏలూరు రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, రెడ్డి అప్పలనాయుడు కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, నాయకులు రెడ్డి గౌరీశంకర్, వీరంకి పండు, జనసేన రవి, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

పేద కుటుంబానికి ఆర్థిక సహాయం

టి.నర్సాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి):మండలంలోని తెడ్లం గ్రామంలో షేక్ ముబారక్ హుస్సేన్ సాహెబ్ గృహనిర్మాణానికి కేతిరెడ్డి సీతారామిరెడ్డి, చంద్రకాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరపున చారిటీ ఫౌండర్ సీతారామిరెడ్డి శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. కేతిరెడ్డి వీరారెడ్డి(చినబాబు), సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ ముప్పన స్రవంతి రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.



చేబ్రోలు రోడ్డు అధ్వానం

ఉంగుటూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జూన్ 15న నారాయణపురం వంతెనకు రంధ్రం పడటంతో ఆ వంతెనకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించారు. దీంతో చేబ్రోలు పోలీసు స్టేషన్ పక్క నుంచి తల్లాపురం వెళ్లే పుంత రహదారితో పాటు చేబ్రోలు పోలీసు స్టేషన్ నుంచి నారాయణపురం వరకు ఉన్న కాల్వగట్టు రహదారిని వేర్వేరు మార్గాల ద్వారా వాహనాల రాకపోకలకు అనుమతినిచ్చారు. ఈ నేపథ్యంలో చేబ్రోలు వంతెన నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లే రహదారి కూడా రాళ్లు లేచిపోయి వాహనదారులకు కష్టాలు మొదలయ్యాయి. దీంతో నారాయణపురం వంతెనకు ప్రత్యామ్నాయంపై వాహనదారులు కొత్త వంతెన నిర్మాణంపై ఆశలు పెట్టుకున్నారు.

వడాలిలో వైభవంగా రథయాత్ర

ముదినేపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి సందర్భంగా వడాలి గ్రామంలో సుభద్ర, బలరామ సహిత శ్రీజగన్నాథస్వామి స్వామి రథయాత్ర వైభవంగా జరిగింది. ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు పూజల అనంతరం జరిగిన రథయాత్రలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మాజీ జడ్పీటీసీ వీరమల్లు రత్నకుమారి పాల్గొన్నారు. రథయాత్ర సందర్భంగా ఇంటింటా స్వామివారికి పూజలు జరిపారు.

నేడు ముసునూరుకు మంత్రి సారథి

ముసునూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ స్థాయిలో జరిగే సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, సొసైటీ అధ్యక్షులు, నీటి సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొనాలని రఘుబాబు కోరారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు : మంత్రి


పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం మెరుగుదలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. శనివారం నూజివీడు పట్టణంలో పర్యటించిన మంత్రికి పారిశుధ్య సమస్యపై పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానికంగా ఉన్న పారిశుధ్య కార్మికులతో మంత్రి మాట్లాడారు. పారిశుధ్య మెరుగుకు తక్షణ చర్యలు చేపట్టాలని, దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించటంతో పాటు, ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యతోనే సమగ్ర అభివృద్ధి : ముద్దరబోయిన

నూజివీడు టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీ గోకుల కృష్ణ యాదవ్ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నూజివీడు నియోజకవర్గంలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన యాదవ వర్గీయులకు ట్రస్టు తరపున నగదు బహుమతిని అందించి సత్కరించారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిబోయిన శ్రీనివాస్, ట్రస్టు ఫౌండర్ అర్ల గోపాలకృష్ణ, అధ్యక్షులు చిర్రా కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తారకేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి చింత నాగమణి, ఉపాధ్యక్షులు గంగాధర్, పాకనాటి సీతారాం, తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులు బీరువా బహూకరణ

ముసునూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు సౌకర్యాల కల్పనలో పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, గ్రామ ప్రముఖుడు దేవినేని వరప్రసాదరావు అన్నారు. ముసునూరు జడ్పీ పాఠశాలలో 1999-2000 సంవత్సరానికి చెందిన టెన్త్ బ్యాచ్ విద్యార్థులు సుమారు రూ. 35 వేలు విలువ గల బీరువా, స్పీకర్, మైక్‌సెట్‌ను సర్పంచ్, గ్రామ ప్రముఖుల చేతులు మీదుగా హెచ్ఎం శైలజకు అందజేశారు. ఎంపీపీ దుర్గాభవాని, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీకి కూరగాయల వితరణ



నూజివీడు టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): టీటీడీ వెంగమాంబ అన్నదాన సత్రానికి నూజివీడు రైతులు కూరగాయలను బహూకరించారు. నూజివీడుకు చెందిన నక్క సత్యనారాయణ ఆధ్వర్యంలో 14 టన్నుల కూరగాయలను అందించగా ప్రత్యేక వాహనంలో తిరుమల తరలించారు. ఈ సందర్భంగా నక్క సత్యనారాయణ మాట్లాడుతూ టీటీడీతో పాటు ద్వారకా తిరుమల, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి సైతం ప్రతి నెలా కూరగాయలను నూజివీడు పరిసర ప్రాంత రైతుల సహకారంతో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.


మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, రూరల్ సీఐ రవికుమార్

ఉత్తమ అవార్డులు అందుకున్న అధికారులు

కైకలూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పలువురు అధికారులు తమ సేవలకు ప్రశంసలు అందుకున్నారు. కైకలూరు రూరల్ సీఐ వి. రవికుమార్, కైకలూరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి. వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయాధికారిణి ఆర్ దివ్య, కొట్టాడ వీఆర్వో కోకా చంద్రశేఖర్, ఎక్సైజ్ సీఐ షేక్ రమేష్ మంత్రి సారథి, కలెక్టర్ వెట్రిసెల్వి చేతులమీదుగా ఏలూరులో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ప్రశంసాపత్రాలను అందుకున్నారు. వీరిని పలువురు అభినందించారు.



ముగిసిన పవిత్రోత్సవాలు

ముదినేపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు శనివారం ముగిశాయి. ఆలయంలో మూలమంత్ర అనుష్టానం, హోమాలు, గోపూజలు, మహాపూర్ణాహుతి, పవిత్ర జలాలతో స్వామివార్ల సంప్రోక్షణతోపాటు స్వామి మాస కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ పవిత్రోత్సవాల ముగింపు కార్యక్రమాల్లో యాజ్ఞీకులు, అర్చకులు గూడూరు రామకృష్ణ శర్మ, తోలేటి వీరభద్ర శర్మ, రుద్రపాక బాలగంగాధర్ తిలక్ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీహరిపురం సర్పంచ్ విశ్వేశ్వరరావు, కూటమి నాయకులు, భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు జరిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475


నూజివీడులో రాజగోపాలస్వామికి పూజలు


చాట్రాయిలోని కోటపాడు, కలిదిండిలో స్వామివార్లు


నూజివీడు ఉట్టి వేడుకలో మంత్రి సారథి


కైకలూరులో పూజలు చేస్తున్న దంపతులు

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..

▸▸భక్తిశ్రద్ధలతో నల్లనయ్యకు పూజలు ▸▸ ఉత్సాహంగా ఉట్టి వేడుకలు ▸▸ ఘనంగా ఊరేగింపు

ఆగిరిపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం శ్రీకృష్ణ భగవానుడు భువిపై అవతరించిన పర్వదినం శ్రీకృష్ణాష్టమి అని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం ఆగిరిపల్లిలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలలో మంత్రి పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కృష్ణాష్టమి అందరి జీవితాల్లో అడ్డంకులు తొలగించి, సుఖ సంతోషాలను నింపాలన్నారు. అనంతరం మంత్రి నెక్కలం గొల్లగూడెం, ఎస్‌పే పేట, వడ్లమాను తదితర గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆగిరిపల్లి మెట్లకోనేరు వద్దగల ఆలయానికి ఉదయం నుంచే భక్తులు తరలి వచ్చి స్వామికి పూజలు చేశారు. పాలు, వెన్న నైవేద్యంగా సమర్పించారు. తమ చిన్నారులను రాధాకృష్ణులుగా అలంకరించారు. ఉట్టి కొట్టి పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో వేణుగోపాలస్వామి గ్రామోత్సవం జరిగింది.

నూజివీడు: నూజివీడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి పార్థసారథి పాల్గొన్నారు. రావిచర్లలో ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి సారథి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావుతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. చిన్నికృష్ణుని చల్లని దీవెనలతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. నూజివీడు పట్టణంలోని కార్ల స్టాండ్ వద్ద నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: నూజివీడు రాజగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి రాఘవ కుమార్ ఆధ్వర్యంలో స్వామివార్లకు పంచామృతాభిషేకం అనంతరం సోము ఫణి, సోము జానకి రామ్, దంపతులు శాంతి కల్యాణం నిర్వహించారు.

ముసునూరు: ముసునూరులో యాదవ్ యూత్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జన్మాష్టమి వేడుకల్లో ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. యాదవ్ యూత్ ఆయనకు ఘన స్వాగతం పలికింది. ఉట్టి కార్యక్రమాన్ని వీక్షించిన ఆయన మాట్లాడుతూ యాదవులంతా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. యాదవ యూత్ ముద్దరబోయిననను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. చెక్కపల్లి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు జరిగాయి. ఆలయ కమిటీ అధ్వర్యంలో కేరళ డప్పులు, సన్నాయి మేళాలతో గ్రామోత్సవం చేశారు. రాత్రి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్ని లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. గోపవరం, కాట్రేనిపాడు, బలివే, గుడిపాడు తదితర గ్రామాల్లో యాదవ యూత్ ఆధ్వర్యంలో ఉట్టి కొట్టి, కోలాటాలు, తీన్‌మార్ వాయిద్యాలతో కోలాహలంగా ఊరేగింపులు నిర్వహించారు.

చాట్రాయి: మండలంలో పలు ఆలయాలు, యాదవ పల్లెలలో శ్రీకృష్ణుడి విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. కోటపాడు పాత రామాలయంలో భక్తులు గీతా పారాయణం, విష్ణు, లలితా సహస్రనామ పారాయణం చేశారు. చిన్నారులు రాధా కృష్ణుల వేషధారణలో అలరించారు.

కైకలూరు: కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి కళామండపం వద్ద శ్రీకృష్ణాయాదవ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. బూరుబోయిన సత్యనారాయణ, మాడపాటి అశోక్ దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన చేసి స్వామివారిని ఊరేగించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. గెలుపొందిన వారికి టీడీపీ కోకన్వీనర్ విజయలక్ష్మి, సర్పంచ్ నాయుడు చేతులమీదుగా బహుమతులు అందించారు. కైకలూరు ఆక్స్‌ఫర్డ్ మేగ్నెట్‌స్కూల్లో విద్యార్థులు గోపికలు, శ్రీకృష్ణ వేషధారణల్లో చేసిన సాంస్కృతి కార్యక్రమాలు విశేషంగా అలరించాయి.

కలిదిండి: కలిదిండిలో శనివారం యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి పురవీధుల్లో మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. అనంతరం ఉట్టి కొట్టిన వారికి కమిటీ సభ్యులు బహుమతులు అందించారు. పెదలంకలో గంగుల సూరిబాబు దంపతులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముదినేపల్లి: అల్లూరులోని శ్రీకృష్ణుడి ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో అర్చకుడు ఐలూరి సుబ్బరాయ శర్మ కృష్ణుడికి పూజలు జరపగా, శీలం వెంకటేశ్వరరావు కృష్ణాష్టమి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శీలం రామకృష్ణ, ముదిరాజ్ సంఘ రాష్ట్ర కార్యదర్శి కోమటి విష్ణువర్ధన్ తదితరులు పూజలు నిర్వహించారు. సింగరాయపాలెం బావాజీ మఠంలో ఈవో ఏ.కొండలరావు ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ముదినేపల్లిలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి శ్రీ కృష్ణుడి రథయాత్రను ఆర్యవైశ్య సంఘ నాయకులు జరిపారు.

మండవల్లి: మండవల్లిలోని శ్రీకృష్ణ మందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారి ఉత్సవ మూర్తిని మేళతాళాలు, డప్పుల మధ్య పురవీధుల్లో ఊరేగించారు.


కైకలూరులో లచ్చన్న విగ్రహానికి నివాళులు


ముదినేపల్లి, కలిదిండిలో నివాళులర్పిస్తున్న నాయకులు


నూజివీడులో లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మంత్రి సారథి


చాట్రాయిలో గౌడ సంఘం నాయకుల నివాళి

బడుగుల అభ్యున్నతికి సర్దార్ కృషి

నూజివీడు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల కోసం పోరాటాలు చేసి వారి అభ్యున్నతికి కృషి చేసిన మహా నాయకుడు గౌతు లచ్చన్న అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా నూజివీడు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో గల ఆయ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి మాట్లాడుతూ గౌతు లచ్చన్న చేసిన సేవలు, పోరాటాలు, కార్యదక్షతకు ప్రజలు ఇచ్చిన కితాబు సర్దార్ అని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమాల్లో పాల్గొన్ని ఎన్నో సార్లు జైలు జీవితం గడిపారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కైకలూరు: గౌతు లచ్చన్న ఆశయాలు మహోన్నతమని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పైడిమర్రి మాల్యాద్రి, మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. కైకలూరు తాలుకా సెంటర్లోని లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కెకె బాబు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, ఎస్సీ సెల్ నాయకుడు వీరాబత్తిన సుధా, మండల ప్రధాన కార్యదర్శి పి రాధాకృష్ణ, పట్టణ అధ్యక్షుడు పడమటి వాసు, పరసా ఏడుకొండలు, పార్టీ పట్టణ మైనార్టీ నాయకులు ఎండీ జాని, ఎండీ ఉస్మాన్, సయ్యద్ బషీద్, సయ్యద్ బాషీర్, నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు పోలగాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలో గౌడ సంఘం నాయకులు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, మండల గౌడ సంఘం అధ్యక్షులు పరసా కనకారావు, ముదినేపల్లి ఉప సర్పంచ్ ఈడే సుధాకర్, గౌడ సంఘం నాయకులు బొర్రా శేషు, జోగి సురేష్, వీరంకి చక్రపాణి, వీరంకి వెంకటేశ్వరరావు, ఈడే ఉమామహేశ్వరరావు, దావు నాగరాజు తదితరులు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, పార్టీ మండల అధ్యక్షురాలు నాగలక్ష్మి లచ్చన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

చాట్రాయి: లచ్చన్న స్వాతంత్ర్య పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని నూజివీడు నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు కందుల కృష్ణ, టీడీపీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు, పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తల్లాడ శ్రీనివాసరావు అన్నారు. గౌడ సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని చాట్రాయి, పర్వతాపురం గ్రామాలలో శనివారం గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం నాయకులు కేకులు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ పిలుపు మేరకు 21 ఏళ్ళ వయస్సులోనే స్వాతంత్ర్య పోరాటంలో అడుగుపెట్టి అనేక సార్లు జైలుకు వెళ్ళారని, 35 ఏళ్ళ పాటు చట్ట సభలకు ఎన్నికై పలు మంత్రి పదవులు నిర్వహించారని, లచ్చన్న ఆశయ సాధనకు కృషిచేయాలని కోరారు. గౌడ సంఘం నాయకులు పానుగళ్ళ కోటేశ్వరరావు, బూబత్తుల చెన్నారావు, చింతగుంట్ల వెంకటేశ్వరరావు, మిద్దె శివాజీ, బొర్రా నాగేశ్వరరావు, మిద్దె సత్యనారాయణ, పలగాని రఘునాదం, గౌడ సంఘీయులు పాల్గొన్నారు.

కలిదిండి: మూల్లంకలో శెట్టి బలిజ సంక్షేమ సంఘం నాయకులు గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వీట్లు పంపిణీ చేశారు. సంఘ నాయకులు బండి తులసీరావు, బొక్కా భోగేశ్వరరావు, గుత్తుల సత్యనారాయణ, మామిడిశెట్టి నారాయణ, తంగెళ్ల గణపతి, కుడిపూడి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.


వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, నాయకులు

వాజపేయికి ఘన నివాళి

ముదినేపల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆటోనగర్‌లోని బీజేపీ మండల కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి ఆధ్వర్యంలో వాజపేయి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మహిళలు

చాట్రాయి: సూరంపాలెంలో బీజేపీ నాయకుడు బుర్రి శ్రీకర్ ఆధ్వర్యంలో మహిళలు, కార్యకర్తలు మొక్కలు నాటారు. శ్రీకర్ మాట్లాడుతూ వాజపేయి హయాంలో దేశం అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించి భారత్ సత్తాని ప్రపంచానికి చాటారని అన్నారు.



నిర్వాసితుల తరపున పార్లమెంట్‌లో పోరాడతా

▸▸ సీపీఎం ఫ్లోర్ లీడర్, కేరళ ఎంపీ జాన్ బ్రిట్టాస్

బుట్టాయగూడెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించి సదుపాయాలు కల్పించే వరకు వారి తరపున పార్లమెంట్‌లో పోరాడతానని సీపీఎం ఫ్లోర్ లీడర్, కేరళ ఎంపీ జాన్ బ్రిట్టాస్ స్పష్టం చేశారు. శనివారం ఏజెన్సీలో పర్యటించిన ఆయన రెడ్డిగణపవం నిర్వాసితుల కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితులను ఆదుకోవడంలోనూ, సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనట్టు తెలిపారు. నిర్వాసితుల కోసం నిర్మించిన కాలనీలు నివాస యోగ్యంగా లేవన్నారు. విద్యుత్, రోడ్లు, డ్రెయిన్లు, మంచినీరు, శ్మశాన వాటికలు ఇతర సమస్యలతో నిర్వాసిత గిరిజనులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల 1.60 లక్షల కుటుంబాలు ముంపునకు గురవుతున్నాయని వాటిలో 80శాతం గిరిజన కుటుంబాలే ఉన్నట్లు తెలిపారు. వీరికి కాలనీలు నిర్మించలేదని, 33 వేల కోట్ల రూపాయల నష్టపరిహారం అందించవలసి ఉందన్నారు. భూముల సేకరణలో అనేక అవకతవకలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని అక్రమాలను పార్లమెంటు వేదికగా ప్రస్తావిస్తానని తెలిపారు. తొలుత ర్యాలీ నిర్వహించారు.


రెడ్డిగణపవరం నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎంపీ బ్రిట్టాస్

పాత పెన్షన్ విధానం అమలు కోసం..

25న విజయవాడలో మహా ధర్నా

ఏలూరు అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నా కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం స్థానిక డీఈవో కార్యాలయం వద్ద మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఓపీఎస్ (పాత పెన్షన్)సాధన సమితి రాష్ట్ర కన్వీనర్లు కె.ఎల్. శ్రీనాథ్, కట్టా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన పెన్షన్ విధానం(సీపీఎస్) 2004 సెప్టెంబరు 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని, ఆ మేరకు సీపీఎస్ అమల్లోకి వచ్చిన తేదీ కంటే ముందుగా నియామకాల నోటిఫికేషన్లు విడుదలై, సెప్టెంబరు 1వ తేదీ తర్వాత నియమకాలు జరిగి ప్రస్తుతం సీపీఎస్ విధానంలో కొనసాగుతున్న సుమారు 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ఉత్తర్వుల ప్రకారం పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వాలతో అనేక మార్లు ప్రాతినిధ్యం జరిపినా స్పందన లేకపోవడం వల్లే ఉద్యమ కార్యాచరణకు మళ్లీ దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ నెల 25న విజయవాడలోని ధర్నా చౌక్ సెంటర్‌లో నిర్వహించే మహాధర్నాకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఏపీ ఎన్జీవోల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ సీహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటి కైనా సీఎం చంద్రబాబు స్పందించి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ రాష్ట్ర నాయకులు హరనాథ్, ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మోహన్, ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకుడు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

నూజివీడు టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంకు చెందిన కె. నాగబాబు తనకు వైద్య సహాయం కోసం ఎల్ఓసీని కోరుతూ మంత్రిని సంప్రదించగా ఆయన రూ. 1.50 లక్షల ఎల్ఓసి పత్రాన్ని నాగబాబు కుటుంబీకులకు అందించారు.

సీఎం సహాయ నిధి మంజూరు

ముదినేపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన షేక్ షాహీద్ అనే విద్యార్థికి సీఎం సహాయ నిధి నుంచి రూ. 10 లక్షలు మంజూరైంది. విజయవాడలోసీఎం సహాయ నిధి సొమ్ముతో మెరుగైన చికిత్స పొందిన షాహీద్ క్షేమంగా ఇంటికి తిరిగి వచ్చాడు. ప్రమాదానికి గురైన ప్రాణాపాయ స్థితిలో ఉన్న షాహీద్ పరిస్థితిని గమనించి సీఎం సహాయ నిధి నుంచి రూ. 10 లక్షలు మంజూరు చేయించినట్టు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ తెలిపారు. ముదినేపల్లికి చెందిన షేక్ అన్వర్‌కు గుండె ఆపరేషన్‌కు కూడా 2.50 లక్షలు సీఎం సహాయ నిధి సొమ్ము మంజూరైనట్లు తెలిపారు. విద్యార్థి షాహీద్‌ను శనివారం వినోద్ పరామర్శించారు.

సర్పంచ్ కైకమ్మకు మాతృ వియోగం

ముదినేపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మకు మాతృవియోగం కలిగింది. ఆమె తల్లి గ్రామ ప్రముఖులు ఇంతేటి పిచ్చమ్మ (86) శ్వాస సంబంధ వ్యాధితో బాధపడుతూ శుక్రవారం రాత్రి రెండు గంటలకు తుది శ్వాస విడిచారు. ఆమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, కుమారులందరూ ప్రభుత్వ ఉద్యోగాలు చేసి రిటైరయ్యారు. ఆమె మృతి పట్ల పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు సంతాపం వ్యక్తం చేస్తూ శనివారం పిచ్చమ్మ భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.

ఆవులు గోశాలకు తరలింపు

కైకలూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కైకలూరులో రోడ్లపై సంచరిస్తున్న ఆవులను గోశాలకు తరలిస్తున్నట్టు ఎంపీపీ అడవి కృష్ణ తెలిపారు. శనివారం బందులో దొడ్డిలో ఉన్న గోవులను గోశాలలకు వాహనాలలో తరలించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు కైకలూరులో రహదారులపై సంచరిస్తున్న ఆవులను బందులదొడ్డిలో బంధించినప్పటికీ రైతులు వాటిని తీసుకువెళ్లకపోవడంతో వాటిని గోశాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. మరోసారి రహదారులపై ఎక్కడైనా పశువులు కనిపిస్తే వాటి యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఏలూరు కొత్త బస్టాండ్‌లో ప్రయాణికుల రాకపోకలపై చర్చిస్తున్న డీపీటీవో షబ్నం, డీఎం వాణి

జోరుగా..హుషారుగా!

(5వ పేజీ తరువాయి)

సూచనలు చేశారు. సెల్‌ఫోన్లలో చూపించడం కాదని, ఆధార్, రేషన్, ఓటర్ ఐడీ, స్టూడెంట్ గుర్తింపు కార్డులను చేతపట్టుకుని రావాలని ఓపిగ్గా వివరించారు. ప్రధానంగా ఏలూరు-ద్వారకాతిరుమల, ఏలూరు-రావులపాలెం, కొవ్వూరు-రాజమండ్రి, ఏలూరు- రాజమండ్రి బస్సుల్లో ప్రయాణికులు ఓ మోస్తరు ప్రయాణాలు చేశారు. తణుకు నుంచి వయా విజయవాడ, గుంటూరు సర్వీసుల్లో మహిళా ప్రయాణికుల సందడి కనిపించింది.

నేడు రెట్టింపు ప్రయాణాలకు అవకాశం

ఉచిత బస్సు అమలు చేయకముందే వరుస సెలవులతో గురువారం నాడే ప్రయాణాలు చేసిన వారు తమ స్వగ్రామాలకు తిరుగుముఖం పట్టాల్సి ఉంది. దీంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి రెట్టింపు ప్రయాణాలు సాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రయాణిలకు ఇబ్బందులు పడరాదని సీఎం సూచనలతో రాత్రి 10 గంటల తర్వాత కూడా డిపోల నుంచి బస్సుల్లో మహిళలను గమ్యస్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.